కథా నిలయం
5257
శ్రీకాకుళం



# యోగదృష్టి

''అన్ని నిందలేమిటో జన్మనిచ్చిన ప్రాణిమీద!'' అనుకున్నది చారుమతి. నిదానంగా ఆలోచించి, ''మహా మహావాళ్లకే, హోదా, స్టేటస్, పవర్ ఉన్నవాళ్లకే నిందలు యెక్కాయి నిజమూ అయ్యాయి. వారు లెక్కచేయలేదు. కామన్ వుమన్ అనగా యెంత? డీసెన్సీ డిగ్నిటీ గూడా నిర్లక్ష్యం చేసిందేమో''.

చారుమతి స్నేహశీలి, మొహమాటమున్నది. ఫ్రెండ్స్ తోడు రమ్మంటే ''రాను'' అనలేదు. విజయ వచ్చి జ్యూయెలరీ షాపు దర్శిద్దాం రమ్మంటే, ఆటోలో యెక్కి, పెద్ద బజారు మీదుగా వెళ్తుంటే ఓ బల్ల కంటబడింది. బండియేయో జరజరా వెళ్లింది. కాని బల్లమీద అక్షరాలు చారుమతి కళ్లల్లో కంప్యూటర్ ఫొటోలాగా నిలిచిపోయాయి.

విజయ చారుమతిని నగలషాపులోపలికి నడిపించుకెళ్లింది. అద్దం తలుపు మూశాడు వాచ్‌మన్. అది ఎ.సి. హాల్. మంచి పెయింటింగ్ గోడకున్నది. అన్ని రాష్ట్రాల స్త్రీలు వారి కట్టు బొట్టు, అలంకారాలు సిగ అలంకరణ వున్నాయి. ఆ వర్ణచిత్రాన్ని చూస్తూ సోఫాలో కూచున్నది చారుమతి. విజయ చాలా సేపు ఆభరణాల అందం చూస్తూ పనితనం మెచ్చుకుంటూ, తెలిసిన వాళ్లు కనబడితే పలకరిస్తూ, వెలగల అందమైన నగలు కొనుక్కున్నది. చారుమతిని లేవదీసి తీసుకొచ్చి చూపింది ''చాలా బావున్నాయి విజయా మంచి కటింగ్. మంచి పొడులు పొదగబడ్డాయి. చెల్లించావా?'' అనడిగింది.

'' ఇక్కడే నిలబడు చారూ. బాగ్‌లోంచి డబ్బుతీయాలి. లెక్కించాలి. భద్రం. ఇరవై అయిదు వేల వరకు లెక్కించాలి. మాచ్ అయే కమ్మలు, గాజులు, కంఠాభరణం తీసుకున్నా. రశీదు తీసుకుందాము'' ఆపని మెల్లిగా అయింది.

అన్నీ బాగ్‌లో భద్రం చేసింది విజయ. పాత బంగారం అమ్మటమూ అయింది. వాకిలి దాటి మెట్లు దిగి, ''కారులో పోదామా చారూ? రెస్టారెంటులో భోజనం ముగించి పోదాం. చల్లగా వున్నది. దీపాలు బావున్నాయి. అదుగో టాక్సీ''.

2

యోగదృష్టి నేర్పబడును అనే అక్షరాలు చారుమతికి మరుపురానేలేదు. శలవు దినాలు కలిసిరావాలి.

పరశురాముని కథ వీడియో ఫిల్మ్ నడుస్తున్నది దూరదర్శన్ మీద. భగవాన్ తన శిష్యుని తొడపై తలవుంచి మంచి నిద్ర తీస్తున్నాడు. మధ్యాహ్నం. నేలకానివున్న బుజానికి వెచ్చని రక్తం తాకి మెలకువ వచ్చింది. లేచి కూచుని చూచాడు పరశురామ. ఎర్రని రక్తం చారలాగా కంటబడింది. శిష్యుడు లేవగానే వాని తొడ తొలుస్తూ రక్తం కార్చిన కుమ్మరి పురుగు పాకి పారిపోతూ భగవాన్ కంటబడింది. పరశురామునికి వింతా ఆశ్చర్యం కలిగాయి. నిలబడి వున్న శిష్యుని చూచాడు. తానూ నిలబడ్డాడు. ఆరడుగుల యెత్తులో బ్రాహ్మణ వేషంలో వున్న శిష్యుని పరిశీలించాడు.

"అస్త్ర శస్త్రాలు నేర్వటానికి బ్రాహ్మణ యువకుని వేషం వేసి వచ్చినట్టున్నావు. కుమ్మరి పురుగు తొడ తొలిచినా కిమ్మనలేదే? బాధ భరించావు" అని అంటూ ఉగ్రదృష్టితో చూచాడు భగవాన్ పరశురామ. అంతా తేటతెల్లమైంది. భగవాన్‌కి నవ్వు వచ్చింది. విచారమూ కలిగింది. గడ్డం గోక్కున్నాడు పరశురాముడు.

"వీడు సహస్ర కవచుడనే సూర్యపుత్రుడు. తండ్రే ఆ కవచాలు రక్షణగా పెట్టాడు. అవి సామాన్య కవచాలు కాదు. తేలిగ్గా పగలవు. వెయ్యేళ్ళు తపస్సు చేసినవాడే ఒక్క కవచాన్ని ఛేదించగలడు. హింసా మార్గం తొక్కాడు. నిస్పృహాయులూ, నిర్బలులూ, నిరాయుధులూ, నిరాధారులూ, అహింసాపరులూ వాని అహంకారానికి గురైనారు. బదరీవనంలో నరనారాయణులనే మునులు తపస్సు చేసుకుంటుంటే, వారి జోలికిపోయి రెచ్చగొట్టి యుద్ధానికి రమ్మన్నాడు సహస్ర కవచుడు. "చేతనైతే నన్ను చంపాలి. ఒక్కొక్కరే రావాలి". నరనారాయణులు వెరవలేదు. వాని అహం తెలిసి నవ్వుకున్నారు. ఒక్కొక్కరే తలపడ్డారు వానితో. తొంభై తొమ్మిది కవచాలు పగిలిపోయినై. సహస్ర కవచుడు

మేల్కొని తెలివినబడి తన తండ్రి దగ్గరకెళ్లాడు.

''నాయనా! యీ న్యాయం బాగుందా? ఒకడు తపస్సు చేసుకుంటుంటే రెండవవాడు యుద్ధం చేస్తున్నాడు. నాకు విరామము విశ్రాంతీ యేవీ'' అని వ్యథ వెళ్లగక్కాడు.

''హింసామార్గం తొక్కద్దు అని చెప్పానే. మించిపోయింది లేదు. ఇప్పటికైనా హింసమానేయి. మళ్లా జన్మనిస్తాను. కవచకుండలాలతో పుడతావు. అదే చివరి కవచం. పెరిగిపెద్దవాడవౌతావు. ఈ మారైనా దుస్సహవాసం చేయకు. ధర్మం కోసమే పోరాడు. దానికోసమే జీవించాలి'' అని ఓదార్చి పంపేశాడు తండ్రి సూర్యభగవానుడు.

చివరి పోరాటం నారాయణుడు చేశాడు. వెయ్యో కవచం ఛేదించే పని నరుని వంతైంది. ఆ నరుడే అర్జునుడు.

కవచకుండలాలతో సూర్యుని వరం వల్లపుట్టిన అబ్బాయిని తల్లి తొట్టిలో వుంచి నీటిపై వదలగా, దానినందుకున్న భర్త సంతానం లేనివాడు, ఆ బిడ్డను తీసికెళ్లి తన భార్య రాధకిచ్చాడు. రాధ పెంచింది. రాధేయునిగా పెరిగాడు.

విలువిద్యా పాటవం చూపే పోటీలో పాల్గొనబోతే, ''పోటీలో పాల్గొన తగవు. అర్హత లేదు. పోటీ రాజపుత్రుల మధ్యే'' అన్నారు తీర్పరులు. అపుడే దుర్యోధనుడనే రాజపుత్రుడు, కురువంశీయుడు, రాధేయుని ప్రేమతో పిలిచి తీసికెళ్లి అంగరాజ్యానికి రాజుని చేశాడు. అర్జనునికి ప్రత్యర్థిగా అంగరాజైనాడు కర్ణుడు.

అర్జనుని యుద్ధంలో యెదుర్కొని చంపాలని, శక్తివంతమైన అస్త్రశస్త్రాలు సంపాదించాలనే, తన వద్దకు వచ్చాడీ రాధేయుడు అంగరాజనబడే కర్ణ.

భగవాన్ పరశురామ విచారంగా చూస్తూ అన్నాడు.

''శిష్యా! నీ తండ్రి సూర్యదేవుడు ముందుగా చెప్పినా గుర్తుంచుకోక, రాజు ననిపించుకోవాలని, సుయోధనుని అంతరంగంలో యేమున్నదో

వూహించక, అధర్మానికి దాసుడివైనావు. ధర్మాన్ని యెదిరించి గెలవగలననే నమ్ముతున్నావిప్పటికీ. సర్వశక్తిమంతుడు నిన్ను గెలవనిస్తాడా? అతడే ధర్మ స్వరూపుడు. ఒకటి వ్యర్ధమైతే, మరొకటి గుర్తు రాదు. రధచక్రం నేలలోకి దిగుతుంది. తీయలేవు నన్ను వదిలి వెళ్లిపో. అనాలోచితంగా శాపమిచ్చాను. నాకూ బాధగానే వున్నది. శపించాలని అనుకోనే లేదు. అంతా దైవ నిర్మితం'' అని చెయ్యి తిప్పి ఆశ్రమం వదిలి వెళ్లిపోయాడు భగవాన్.

రాధేయుడు గురువు మాటలు సగం నమ్మీ సగం నమ్మకా విల్లమ్ములందుకుని ఆశ్రమం వదిలి వెళ్లిపోయాడు.

ఈ యేకాంకిక చారుమతీ, విజయా చూసి లేచారు. మెడికల్ కాలేజీ విద్యార్ధులు, హాస్టల్ ఆనివర్సరీ చేసుకుంటూ విందుకి పిలిచారు వీరిద్దరినీ. కొత్తగా మొదలు పెట్టిన దూరదర్శన్, ఫాక్సు మెషీన్, కంప్యూటర్, మైక్రోవేవ్ వంటివి వాడటం మొదలు ఆనాడే. అందుకని చూపారు. విజయ తల్లికి అనారోగ్యంగా వున్నదని ఫోనొస్తే వాళ్ల వూరు వెళ్లింది. రెండు రోజులు శలవులు కలిసివచ్చాయి. చారుమతి ఆలోచనలు యోగదృష్టి నేర్పబడును అనే బల్ల చుట్టూ తిరుగుతూనే వున్నాయి. సాయంత్రం యెండ వేడిమి తగ్గి చల్లబడ్డాక వాకింగ్ చేద్దామని రక్తపోటు అదుపుచేద్దామని, నడుస్తూ బల్లల వంక తలెత్తి చూస్తూ మళ్లా దారి వంక చూస్తూ వెళ్లింది. ''యోగదృష్టి నేర్పబడును'' అనే బోర్డుమీద దృష్టి నిలబడిపోయింది. జ్ఞానానంద అనే పేరు చూసి మెట్లవేపు వెళ్లింది. నాలుగంతస్తులెక్కింది. మళ్లా బోర్డు చూసింది. కాలింగ్ బెల్ నొక్కింది. తలుపులు తెరుచుకున్నాయి. లోపలకు అడుగులు వేసింది. అందమైన హాలు. నేల మొజాయిక్ టైల్సుతో ఆకర్షించింది. చిన్న చిన్న తివాసీలు డిజైన్లున్నవి పరిచినట్లున్నాయి. వాటి మీద విద్యార్ధులు పద్మాసనాలు వేసి కూచుని వున్నారు. యెడమ అరచేతిలో కుడి అరచేయి. బిగుతైన దుస్తులు. శిఖ. మెళ్లో తావళాలు. గోడలకు పాల రాళ్లున్నాయి. యోగ సంబంధమైన చిత్రాలు. ఆసనాల చిత్రాలు. తర్వాత తలా కళ్లా తిప్పుతూ చూస్తుంటే కృష్ణుడు యోగి, శివుడు యోగిరాజు, వ్యాస మహర్షి, నారాయణ

తీర్థ, నరనారాయణులు, హరనాథ బాబా, శాయీ బాబా, శుక భైరాగి, జీసస్, శివాజీ, బేడెన్ పావెల్, మదర్ థెరిసా, హనేమూన్, వాగ్గేయ కారకులు, కవిత్రయం, పోతనామాత్యుడు, రామదాసు, కబీర్, నానక్, గొప్ప శిల్పులు, చిత్రకారులు, గాయకులు, గాయనీమణులు, నెరదాతలు, నాట్య కళలో ప్రసిద్ధులు, కొత్తయంత్రాలు కనిబెట్టినవారు, రైటు సోదరులు, దయానంద, రామమోహన, నాట్యకత్తెలు, కోటికి పడగలెత్తిన వారు, కొత్త ఔషధాలు కనిబెట్టినవారు, నడిపినవారు, బాపూ, లెనిన్, సుకర్ణో, ప్రజాస్వామ్యం తెచ్చినవారు అలా. నక్షత్రమండలంలో వింతలు కనిబెట్టినవారు, భాస్కరాచార్య ఇంద్రజాలం చూపిన దిట్టలు, గొప్ప నటులు, మంత్రద్రష్టలు, మాస్టరు సివివి, రాజ్య తంత్రజ్ఞులు, విద్యారణ్యాస్వామి చిత్రాలు కంటబడినయ్యి.

''కూచోవమ్మా! ఒకే చోట నిలబడి యేకాగ్రతతో పరిశీలిస్తూ గుర్తుపడుతున్నావే. పెదవులు వారి పేర్లను, వుచ్చరిస్తూ కదులుతున్నాయి. అది యోగి లక్షణమే. ధనుర్దాసును యోగిగా గుర్తించాడు రామానుజ'' అన్నారు ఆనంద నవ్వు మొహంతో.

చారుమతి స్వామిని చూసి వినయంగా నమస్కారం చేసి ఆయనకెదురుగా ఖాళీగా వున్న పాలరాతి మీద కూచున్నది. యెవరూ కదలి ఆమెను చూడలేదు.

''యోగం నేర్వాలని యెందుకనిపించింది? సైన్సు చాలా ముందుకు పరుగెత్తిందే? కంప్యూటర్, వరల్డ్ వైడ్ వెబ్, ఇంటర్నెట్ వంటివి సుగమమార్గాలు చెప్పుతాయి. నేర్పే అకాడమీలున్నాయి. తెలుసుకోవాలి'' అన్నారు ఆనంద.

ఆనంద ఆకర్షవంతమైన విగ్రహం. ధరించినవి కాషాయంబరాలైనా, ఆ దుస్తులలో నించే ఆయన సౌష్టవ శరీరం కనబడుతుంది. నల్లని నిగనిగలాడే గడ్డం, మీసం, తలకట్టు. తీరైన మొహం. యెర్రని పెదవులు. తీర్చినట్టున్న కనుబొమ్మలు. పెద్ద కళ్లు. ఒకే ఒక తావళం మెళ్లో. క్రికెట్ ఆటగాడల్లే వుంటాడు. యోగాభ్యాసముత చేసినట్లే వుంటాడు.

'' ఆ మోడరన్ యోగం నేర్పేవి వెల యెక్కువ. టైమూ కావాలి. ఒక విధంగా నాది దినభత్య జీవితం. యోగదృష్టి నేర్వాలనే అభిలాష చిన్నప్పటి నించే వున్నది. అంతేగాక కొద్ది రోజుల క్రితమే యోగదృష్టి అనే ఏకాంకిక చూశాను. దానిలో భగవాన్ పరశురామ తనను మోసగించి అస్త్ర శస్త్రాలు నేర్చిన శిష్యుని, కుమ్మరి పురుగు తొడ తొలచినా ఓర్చినవాని నిజవృత్తాంతం వాని ఆశయం యోగదృష్టితోనే తెలుసుకుని, మందలించి సత్యం తెలుసుకోమని పంపేశారు. అది చూశాక గురువు ద్వారా నేర్వటమే మంచిదని తోచింది. యంత్రాలకి ప్రేమాభిమానాలుండవు'' అన్నది నవ్వుతూ.

ఆనంద నవ్వుతూనే అన్నారు ''ద్వాపరంలోనే ఇంటర్నెట్ వుండేదేమో! భగవాన్ దానిని చిన్నదిగా చేసి బ్రెయిన్‌లో గుప్తం చేశారేమో. అవసరానికే పాడుకునేవారేమో నాటిక ముగింపు బాధ కలిగించిందా?''

''కలిగించలేదు స్వామీ. ధర్మ స్వరూపుడు. అధర్మం గెలవనీయడు. కొంతసేపు అధర్మం గెలుస్తున్నట్టు భ్రమ కలుగుతుందంతే. దయ్యాలు త్వరగా పలుకుతాయి. దైవం ఆలస్యంగా పలుకుతాడట'' అని నవ్వింది చారుమతి.

''బాగున్నది. కొంత మంచి దృష్టి వున్నట్టే తల్లీ. కాని యేమి తెలుసుకోగలగాలని, యోగదృష్టి మీదికి పోయింది అభిలాష? అదీ తెలుసుకుందాము''త.

''చాలా ఆదరంగా మాట్లాడుతారు స్వామీ. ఒక సామాన్య స్త్రీ మీద యెక్కగూడని నిందలెక్కినై. అన్ని నిందలేమిటి? అవెంతవరకు నిజం అని తెలుసుకోవాలని అనిపించింది. దాచటమెందుకు స్వామీ. ఆ స్త్రీయే నన్నీ భూమి మీద పడేసింది. నేనామె పండించిన పన్నెండో కడుపుపంటను'' అని తలవంచుకుని తన చేతులూ వేళ్లూ చూసుకున్నది చారుమతి.

''నువ్వు యోగదృష్టితో అవన్నీ తెలుసుకోరాదనేమో భగవంతుని వుద్దేశం. అందుకే అవకాశమీయలేదేమో''. ఆనంద తన కాబోయే శిష్యురాలి మనసు

మళ్లించాలని చూశాడు. నిశితంగా పరిశీలించినా శిష్యురాలి ముఖం మీద కుత్సితం కానరాలేదు స్వామికి.

''కావచ్చు స్వామీ. కొన్ని నమ్మశక్యం కాలేదు. నిజమేనా అని దుగ్ధ పట్టుకున్నది. ఆశ్చర్యంగూడా కలిగింది''.

''రెండంటే రెండు నిందలు వుదహరించు తల్లీ! యెందుకు నమ్మలేక పోతున్నావో నాకన్నా తెలుస్తుంది'' ఆనంద దయ వల్లా జాలి వల్లా కొంత ప్రోత్సాహమిచ్చాడు.

''అవి చెప్పటం డీసెన్సీ కాదు స్వామీ. ఇందరెదుట చెప్పటం సభ్యతాగాదు, కల్చరూ గాదు'' అన్నది తలెత్తకుండానే.

''పోనీ వ్రాసివ్వు. వ్రాత పరికరాలివ్వనా యెవరికీ చూపను. మాటిస్తున్నాను. యోగినీ, స్వామినీ గదూ!'' అని చారుమతి వ్యధ తుడవాలని చూశాడు స్వామి.

''వచ్చింది యోగదృష్టి నేర్వాలని స్వామీ. తల్లి మీది నిందలు రాసివ్వటానిక్కాదు'', చారుమతి మొహం యెర్రబడింది.

'' ఐసీ. ఇష్టం లేదని తేలింది. నీకింకా తల్లి మీద గౌరవం పోలేదని తేలింది. నువ్వు నేర్వాలనుకునేది, అమూల్యమైనదే కాని చాలా శ్రమించాలి. చదవాలి. అన్నిటికన్నా ఏకాగ్రత సాధన చేయాలి. వీరిని చూడు. ఇంతసేపైంది ఒక్కరన్నా కదిలారా? తలతిప్పారా. ఉత్సుకత తమను లొంగదీయకుండా యోగసాధన చేస్తున్నారు. పురాణగాథలు చాలా బాగుంటాయి. తెలుసుగా? శమీకుడనే ముని యేకాగ్రత సాధన చేస్తున్నాడు. అంతర్ముఖుడైనాడు. అట్టి సమయంలో పరీక్షన్మహారాజు వచ్చి దాహమడిగాడు. పలకలేదని దాహార్తి తీర్చలేదని, రాజు గదూమరి, కొంగజపమని తీర్మానించి, అక్కడే కంటబడిన చచ్చినపాము నొకదానిని వింటి చివరతో యెత్తి, యోగ సమాధిలో వున్న శమీకుని మెడలో వేసి వెళ్లిపోయాడు రాజు. అప్పటికీ చలనం లేదు మునిలో.

కొడుకు శృంగి తన మిత్రులతో వచ్చి చూచి, తండ్రి మెడలో వున్నది బతికివున్న పామే ననుకుని, తీసి పారవేయటానికి జంకి, ''నా తండ్రి మెడలో పాము వేసినవాడు నేటికేడవనాడు, తక్షకునిచే కాటువేయబడి చచ్చుగాక''అని కమండలంలోని నీళ్లు కుడిచేతిలో పోసుకుని వదిలాడు. ఒడుగైనవాడే. పామును తీసివేయలేక యేడుస్తూనే వున్నాడు. సహాధ్యాయులు చూస్తూ నిలబడి పోయారు. చూశావా తల్లీ శమీకమహామునిది యెంత ఏకాగ్రతో! యెంత అంతర్ముఖత! బయటి ప్రపంచాన్నే మరిచాడా ముని''.

''కొంత సేపైంది. ముని కళ్లు తెరిచి, మెడలోని పామునూ చూచాడు, యేడుస్తున్న కొడుకునూ చూచాడు. నిలబడివున్న శిష్యులనూ చూచాడు. పామును తీసి దూరంగా పారేశాడు''.

''దేనికేడుస్తున్నాడు శృంగి?'' అని అడిగాడు.

''రాగానే మీ మెడలోని పామును చూసి, భయపడి బతికున్నదేననుకుని, తీసి పారవేయ భయపడి, శపించాడు గురూ. నేటికేడవరోజున ఆ పాము వేసినవాడు తక్షకునిచే కాటు వేయబడి పోవును అని నీళ్లు వదిలాడుగాని గురూ అప్పటికీ పామును తీసివేయటానికి ధైర్యం చాలింది గాదు''.

శమీక ముని యోగదృష్టి అప్లై చేసి జరిగింది తెలుసుకుని విచారించాడు. కోపగించలేదు.

కొడుకును చూసి, ''శృంగీ! బ్రాహ్మడికి క్షమ వుండాలి. అది ముఖ్య లక్షణం. ఆ వచ్చినది హస్తినాపురమేలే రాజు పరీక్షన్మహరాజు. వేటాడి భటులకు దూరమై వచ్చి డస్సి, దాహంతో వచ్చాడు. దాహమిమ్మని అడిగి వుండాలి. నేను ధ్యాన నిమగ్నుడనై నందువల్ల వినరాలేదు. రాజు గదూ అసహనంతో పాము నెత్తి నా మెడలో వేసి వెళ్లి వుండాలి. శృంగీ! రాజుని శపిస్తే అరాచకాన్ని ఆహ్వానించినట్టే. అయ్యో! శృంగీ! పరీక్షన్మహారాజు తల్లి గర్భంలో వుండగా, ద్రోణ పుత్రుడు అశ్వద్ధామ అహంకరించి, కృష్ణ పరమాత్మలేడని తలచి,

''అపాండవమగుగాక'' అని అస్త్రం వదిలాడు ఆ అస్త్రం ఉత్తరాగర్భాన్ని ఛేదించింది. చచ్చి కిందబడ్డాడు శిశువు. కుంతీదేవి కృష్ణునితో మొరపెట్టుకున్నది. కృష్ణపరమాత్మ వచ్చి బిడ్డను పరీక్షించి తడిమి వళ్లంతా రాయగానే బిడ్డ యేడిచాడు. పరీక్షించాక జీవించాడు గనక పరీక్షిత్తు అన్నారు. విశ్వరూపుడు జీవ నాశనం కానీయడు. మిగిలి వుండేట్టే చూస్తాడు. కనక పరమాత్మను అవినాశి అని పిలుస్తారు. అలా విగతజీవుడై భూమి మీద పడి దైవ కృపవల్ల జీవించి పెద్దవాడైన రాజును నీవు మళ్లా శపించావే? తప్పు చేశావు. పరిహారం కింద నీవే హస్తినాపురం వెళ్లి రాజదర్శనం చేసుకుని, అంతా చెప్పి ''రక్షణ కల్పించుకో మహారాజా!'' అని చెప్పిరా అన్నాడు శమీకుడు.

శృంగి భయపడిపోయాడు. ''నేను వెళ్లను. రాజు చంపిస్తాడు'' అన్నాడు.

''యెవరూ పోరా నాయనలారా! నేనే వెళ్లి చెప్పిరానా?'' అనడిగాడు శమీకముని.

ఒక శిష్యుడు ముందుకొచ్చాడు. చేతులలోనివన్నీ కింద వుంచాడు. ''నేను వెళ్లి చెప్పి వస్తాను గురూ! మీరు వెళ్లక్కర్లేదు'' అని దణ్ణం పెట్టాడు.

గురువు సంతోషించాడు.

ఆ కథలో గమనించాల్సింది, యేం జరిగిందో చెప్పేవారు లేరని గ్రహించి, శమీక మహాముని, యోగదృష్టి అప్లై చేయటమే గాక, కర్తవ్యం గూడా చెప్పగలిగాడు. యోగానికి అంత ఏకాగ్రత కావాలి. యోగమంటే బయటగాలి తిరుగుతూ మనలో వున్న గాలిని తనతో తిరగటానికి రమ్మని లూర్ చేస్తే, కొద్ది సేపైనా దానిని ఆపి దూరంగా వుంచగలగటమే యోగం. అలాటి పద్ధతి సాధన చేసినవారు తాము సాధించదలచుకున్నది సాధించగలుగుతారు. ఏకాగ్రత సాయపడును'' అని ఆగాడు ఆనంద.

''అంత ఏకాగ్రత సంపాయించటం కష్టమేమెూ? బాగా టైమ్ కావాలేమో?'' అన్నది చారుమతి. ఆలోచనతో తలెత్తి ఆనందను చూసింది.

వుత్సాహం కనపడలేదు స్వామికి. దయతో అన్నాడు.

''అప్పుడే నిరుత్సాహపడ్డావే తల్లీ! పోనీ ఓ పని చేతాము. ఆశ్రమంలోపలి భాగంలో యంత్రమున్నది. కొనలేనన్నావు. రోజూ వచ్చి నేర్చుకుని, సాధన చేయి. నేర్పుతాను. మెల్లిగా చేతనౌతుంది. నిజం తెలుస్తుంది. నాకేమీ రుసుము చెల్లించక్కర్లేదు'' అని ప్రోత్సాహమిచ్చాడు.

''అది బాగున్నది స్వామీ! ఆ సలహా పాలో అవుతాను. మీకు శ్రమ అని వెరుస్తున్నాను''.

''నాకు శ్రమ లేదు. తెలుసుకునేం చేస్తావో చూడాలి. మళ్లా నా సాయం కోసం చూస్తావేమో. చూడకపోతే గొప్పదానివే'' అన్నాడు నవ్వుతూ.

సాధకులంతా కళ్లు దెరిచిలేచి, చిత్రాలకు నమస్కారం వేసి హాలు వదిలి వెళ్లిపోసాగారు.

అందరూ వెళ్లాక చారుమతి అడిగింది.

''ఈ సాధకులంతా యోగదృష్టిమీద భ్రమ పెంచుకున్నవారేనా స్వామీ?''

''కాదు కాదు చారుమతీ. కొందరు యోగం నేర్చి యోగా ట్రీట్‌మెంటుతో దీర్ఘవ్యాధులను, నయంగాని వ్యాధులను కుదిర్చి పేరు సంపాయించాలని, మరె కొందరు చిన్నపిల్లల వ్యాధులు, బాధ కలిగించకుండా నయంచేసి, ఆ బిడ్డల ఆనందం చూసి సంతోషించాలని, నిస్సంతులై కుమిలేవారికి యోగాభ్యాసం నేర్పి, వ్యాయామం కొన్ని ఆసనాలూ నేర్పి, వారు సంతానవంతులైతే వారి ఆనందం చూడాలని, అలాగే మరికొందరు శ్రీమంతులు కావాలని, పనులు నెరవేరాలని, పాము కాటు దింపాలని కోరికతో నేరుస్తున్నారు. గడచిన కాలంలో నరసయ్య అనే ఆయన చాలామంది పాముకాటుతో పోవటం బంధువులేడవటం చూడలేకపోయాడు. ఆయన ఒక సిద్ధునాశ్రయించి వుపదేశం పొందాడు. నిష్ఠా నియమాలు పాటించి ఓర్మితో లక్షసార్లు జపించాడు. అర్ధరాత్రి రావిచెట్టు కింద వున్న పుట్టలో వున్న నాగేంద్రుని ప్రార్థించాడు. నాగేంద్రుని

దర్శనమైంది. పాముకాటు దింపే శక్తి స్వాధీనమైంది. పాముకాటు నిమిషాలమీద దింపేసి బతికిస్తూ ఆనందిస్తూ ఖ్యాతికెక్కాడు నరసయ్య. పాముల నరసయ్య అని పేరు పొందాడు. జపించుట ఆపలేదుట. చివరికి ఆయనపేరు మూడుసార్లు చెపితేనే కాటు దిగిపోయేదిట. స్టేషన్కు తీసికెళ్లి వైరిస్తారు నరసయ్యగారున్న స్థావరానికి. కాటుబడినవానిని నేలపై వుంచి, వుత్తరీయంతో విసురుగా విసురుతూ ''పాముల నరసయ్య వచ్చాడులే'' అని పిలవగా కొద్దిసేపటికే కాటుదిన్నవాడు విషం దిగి లేచి కూచునేవాడుట. చన్నీళ్ల స్నానం, చుట్ట తాగరాదు. త్వరగా అరిగే ఆహారం పాటించాలి. నార్మల్సీ వచ్చాక ఆపచ్చు అని'' అని ముగించాడు స్వామి.

''అందరివీ సదాశయాలు, ప్రజాసేవకు చెందినవే స్వామి. వ్యక్తిగత మోక్షం కోసం గాదు'' అని నమస్కారం చేసి హాలు వదిలింది చారుమతి.

2

తల్లికి నిమ్మళించి, తన పనులు తాను చేసుకోగలగటం మామూలు భోజనం అలవడగానే తల్లి భద్రమ్మతో చెప్పి బందరునించి వచ్చేసింది విజయ.

గమనిస్తే చారుమతి యెక్కడికో వెళ్లి వస్తున్నది. చెప్పలేదే అనుకున్నది విజయ. అనుకూల రిచ్ ఫ్రెండ్ అందాడేమో అనుకున్నది. వాడికి తగినంత టైమ్ లేక, చారుమతి చేత చేతిలో చెయ్యి వేయించుకుని మీటింగ్స్ అలవాటు చేశాడేమో గడుసు రిచ్మేన్, రిప్రొడక్షన్ వయసు దాటిందే! పిల్లా మేకా కావాలని ఆరాట పడుతున్నట్టేనాడు కానరాలేదే చారుమతి! ఇప్పుడెందుకూ దండగ? పరాకూ, మౌనం గూడా బాగా లేవు అని మధనపడింది విజయ. బాదరబందీ లేకవుండటం, సింగిల్ లైఫ్, తనను తను సపోర్ట్ చేసుకోటం అవీ చారుమతి ఆశయాలు. సింపుల్ లైఫ్ అండ్ హై థింకింగ్ అదీ చారుమతి నైజం. చివరికి తనను తాను సంబాళించుకోలేక విజయ,

''చారూ! ఇవాళ నేను తోడు రానా? తల్లో వెండి తీగలంటి వెంట్రుకలే లేవు. రిచ్ అవుతున్నావు. యెవరన్నా యెబ్డక్ట్ చేస్తారేమో నిన్ను? నన్ను రాన్సమ్

అడుగుతారేమో? టాక్సీలో వెళ్దామా?త యెన్ని కార్లు! యెంత అందమైనవి. యె.సి. కార్లూ వున్నాయి అద్దెకి. పాండురంగ బాడుగకిచ్చే కార్ల బిజినెస్ నడుపుతున్నాడు. ఫోన్ చేయి. కారు వాకిట్లో గేటు ముందుంటుంది. ఇబ్బంది లేనే లేదు''.

తయారౌతున్న చారుమతి నవ్వుతూ విజయవేపు చూసింది. విజయ హాస్యం బాగుంటుంది.

''నేనే చెపుదామనుకున్నా విజ్జీ! నీ ఆరాటం తెలుసు. సొద వినలేక విసుగు చెందుతావేమోనని చెప్పలేదు. నేనెవర్నీ మీట్ కావటానికి వెళ్ళటం లేదు డియర్ విజ్జీ! నువ్వు నన్ను తోడు తీసికెళ్ళినప్పుడు దోవలో ''యోగదృష్టి నేర్పబడును'' అనే బల్ల కంటబడింది. నువ్వు వూరికెళ్తే తోచక, శలవు రోజున వెళ్ళి చూసి వచ్చా. ఆ స్కూల్‌కి వెళ్ళి వస్తున్నా. చాలా ఇంటరెస్టింగావున్నది కోచింగ్. టైమే గుర్తు రాదు'' అన్నది.

''యోగదృష్టా! వింతగా వున్నదే! అంటే గడిచింది తెలుసుకోవాలనా, భవిష్యత్ తెలుసుకోవాలనా? నీకు అభ్యంతరం లేకపోతే నేను వచ్చి క్లాసెస్‌కి అటెండవుతా. ఇంటర్నెట్టేమో. వరల్డ్ వైడ్ వెబ్ అనేవేమో నేను కంప్యూటర్ ఫెయిర్ కాఫీ తీయటంతో ఆపేశా. మూడు భాషల్లో చేస్తున్నా. ఆదాయం బాగానే వున్నది. మరేమో ఫ్రెండ్ నందిని వీడియో పార్లర్ అని నడుపుతున్నది. అది పార్ట్ టైమ్ పని పాతవీ కొత్తవీ గూడా ఫిల్మ్స్ అద్దెకిస్తుంది'' అన్నది డ్రెస్సింగ్ టేబిల్ ముందు నిలబడి.

''అభ్యంతరం చెప్పేందుకేమున్నది విజ్జీ! తప్పకుండారా. గురువుగారూ, స్కూలు గూడా అట్రాక్ట్ చేస్తారు. అసలు జ్ఞానానంద స్వామి స్టూడెంట్ అనిపించుకోవాలనే చేరతారేమోననిపిస్తుంది. చల్లని చూపు, కల్మషంలేని మాటలు. సింపతీ. హర్ట్ చేయరు''.

విజయ లేచి అన్నది ''మగవాడిననుమానించే చారుమతి నాకర్షించాడంటే ఆ గురువును నేనూ కలుసుకోవాలి. నేను ఇంటర్నెట్ రన్ చేయటం నేర్వాలనే

అనుకున్నా''. కారుకు ఫోన్ చేయాలని విజయ లివింగ్ రూమ్‌లోకి వెళ్లింది. చారుమతి నీట్‌గా డ్రెస్ చేసుకుని చేతిసంచీ అందుకున్నది.

3

బాపూ కొల్లాయిగట్టి చొక్కా తీసేసి, చరఖా అందుకుని నూలు వడికి, మేకపాలు, వేరు శనగపప్పు ఆహారంగా తీసుకుంటూ నియమిత వేళకి ప్రార్థనా వంటి వాటితో జనాన్ని ఆకర్షించారు. వారానికో రోజు మౌనవ్రతం, ఒకరోజు నిరశన వ్రతం. నలభై యేండు నించి బ్రహ్మచర్యం నియమంగా పెట్టుకుని, పూజనీయుడై, నాయకుడై ప్రజలను స్వాతంత్ర్యం వేపు నడిపించారు. దాస్య విముక్తి ఆయన గమ్యం. గడ్డాలూ మీసాలూ జుట్టూ పెంచలేదు. నీట్‌గా వుండేవారు. సత్యం, అహింసా ఆరాధించారు.

కాంతమ్మ మొదటి బావగారు గడ్డాలూ, మీసాలూ జుట్టూ బాగా పెరగనిచ్చి, చిన్న నేత దోవతీ కట్టి, చొక్కా విసర్జించి పై కండువా వాడి, జారీ చెంబు రుద్రాక్షల తావళంతో బంధువులనాకర్షించాడు. తుంటరి బంధువు ఆయన్ని రుద్రాక్షప్పిల్లి అని అనేవాడు. యేం చేస్తూవుంటాడో తెలియదు. దేశభక్తుడా డబ్బు భక్తుడా అనే మీమాంస బయలు దేరింది పరిచితులలో.

తండ్రికి షష్ట్యబ్ది పూర్తి అయి అయిదేళ్లయింది. మతిలేని మాటలు మాట్లాడుతున్నాడనీ, మతిలేని పన్లు చేస్తున్నాడని ఆయుర్వేద వైద్యుని చేత సర్టిఫై చేయించి, నలభై యెకరాల మాగాని అమ్మ గలిగాడు మొదటి బావగారు గురునాథం గారు. నిగ్గదీస్తే భూమి పండటం లేదు. పంట అమ్మితే శిస్తుకి సరిపోతున్నది. ఫలసాయమేదీ అన్నాడు గురునాథం గారు. నాలుగెకరాలు తండ్రి అంత్యక్రియలకు అమ్మేశాడు. పెంకుటిల్లు పాతదై రిపేర్లు కోరుతున్నది. దానినీ అమ్మకానికి సిద్ధం చేశాడు గురునాథం మిగిలిన భూమి పంచితే ఒక్కొక్కరికీ ఆరెకరాలు చెందాయి. ఇల్లు అమ్మగా వచ్చింది తల్లిపేరనేశాడు. వంతులవారీగా ఒక్కొక్కరి వద్దే వుంటుంది తల్లి.

కాంతమ్మకు విచారానికి బదులు సంతోషం కలిగింది పాడు పల్లెటూళ్ళో, పల్లెటూరి గబ్బిలాలతో గడపక్కర్లా యిక. హాయిగా తమ వూరు వెళ్లి, ఉద్యోగస్థులు, హోదా, పేరు ప్రఖ్యాతులు, సిరిసంపదలు, నాగరకతా కలిగిన తన వారి మధ్య వుండే అవకాశం యిచ్చాడు దేవుడు. సరసాలు, విరసాలు, శిఖపట్ల గోత్రాలు, జంధ్యాలు తెంపటం వినోద కార్యక్రమాలుంటాయి. గోతులు త్రవ్వటం, మానావమానాలు సమానం. గౌరవాగౌరవాలు లెక్కచేయరు. మన్నుదిన్న పాములల్లే వుంటే జీవితం రంజుగా వుంటుందా? రోషం వేషం వద్దా? కాంతమ్మ యెవరిల్లు ఆక్రమించాలో నిశ్చయించుకుని, పురకలు వేసే మనసు తో తమ వారి మధ్య కెళ్లింది సకుటుంబంగా.

4

సరదాలు, సరసాలు వచ్చాయి జీవితంలో. కుడివేపు పురపాలక సంఘ అధ్యక్షుడూ, క్రిమినల్ లాయరు అన్న. దాయాది అయితే నేమీ? యడమవేపు అంబను పలికించే నూరెకరాల స్వంత వ్యవసాయం చేసి దాయాది అన్న. ఆయన్ని పూజించి మేళతాళాలతో తీసికెళ్లి పసుపు పంటకు మొదటి దుంప పాతిస్తారు రైతులు. దాపులనే పెద్దప్పా బావా, దాయాది అన్నలు అప్పలూ, సందడి, దసరా వుత్సవాలు, గణం పెరగటం అమ్మవారు పలకటం. తన్నితే గారెల బుట్టలో పడ్డట్టున్నది. విసుర్లు, ఉద్రేకాలు, యెంతో ఆనందాన్నిస్తాయి.

గ్రామంలో వుండగానే నలుగురు బిడ్డల తల్లి అయింది కాంతమ్మ. కూతురు వరలక్ష్మి, యిద్దరు మగపిల్లలు, సత్యం, శివరామ, తర్వాత సరసు. తెలిగ్గానే భూమ్మీద పడేస్తున్నది పిల్లల్ని. తల్లి లేకపోయినా పింతల్లి దుర్గాంబ వచ్చి పురుడు పోస్తుంది. తల్లిలాగే చూస్తుంది. ఆమెకు సంతు కలగలేదు. వేడుకలు చేస్తుంది.

అష్ట వర్షా భవేతత్ కన్యా అని మగడు యిద్దరాడ పిల్లలకీ పెళ్లిళ్ల చేశాడు. ఇద్దరు మగబిడ్డలకు ఒడుగులు చేశాడు. కన్యాదానం వల్ల అటేడు తరాలూ

యిటేడు తరాలూ తరిస్తాయట. దాంతో కొంత మాగాని కర్పూరంలాగా హరించుకు పోయింది.

''చెవులకి రాళ్ల కమ్మలన్నా లేని కాంతమ్మ కప్పుడే గొప్పింటి బిడ్డలు అల్లుళ్లుగా వచ్చారే'' అని ఆశ్చర్యపోయింది పక్కింటి వదిన. ''ముప్పయి యేళ్లన్నా రాలేదు కాంతమ్మ మనమరాల్నెత్తుకో బోతున్నది'' అన్నది యీ వైపున్న వదిన. ''రాళ్లకమ్మలు లేకపోతేనేం, భూమి తరిగిపోతేనేం, వుచితంగానే అన్నీ సంపాదించగలదు కాంతమ్మ. అదొక తమాషా లేదా కనికట్టు'' అని నవ్వింది పెద్ద వదిన.త వెనుక యింట్లో వుంటున్నది అన్న వుద్యోగి అయి విషజ్వరం తాకి పోయాడు.

'స్నేహంగా వున్నట్టు, సహాయపడుతున్నట్టు నటిస్తూ హాస్యాలాడుతూ బాగానే దాష్టీకమూ చేస్తుందీ, పెటకమూ పెడుతుంది. తనకొక్కవాల్సినది నేర్పుగా లాగేస్తుంది. నీ వాళ్లకివ్వటం లేదా? అత్తవారు కాజేస్తే తప్పా అని దెప్పి నోరు మూయిస్తుంది. యేమీ యెరగనట్టు మొగుడు పెళ్లాం మధ్య వచ్చిన తగాయదా సద్దేసి వారిని కలిపి అన్యోన్యత నేర్పినట్టు నాటకమాడుతుంది'' అన్నది మరో జ్ఞాతి మరదలు.

''అన్నీ చూస్తూనే, గ్రహిస్తూనే కాంతమ్మను రానిస్తున్నావే సరోజనమ్మా?'' అన్నది మరో బందుగురాలు. నోటి మీద చెయ్యి వేసుకుని విడ్డూరపడినట్టు చూసింది. '' ఒకళ్లు రానిచ్చేదాకానా. హయ్యో, తానే చొరవగా వచ్చి పనిఅందుకున్నట్టు నటిస్తూబురిడీ వేస్తుంది. ఇతరుల కాపరాలు కడిగిబోస్తూ మస్కావేసి, డబ్బు లాగుతుంది నేర్పుగా. నీవే యిస్తే రెట్టింపు అడుగుతుంది''.

''అబ్బో. బాగా గమనించావే'' అని విరగబడి నవ్వింది.

5

''కాంతమ్మా! నువేం చేయద్దు. పని చేయద్దు. పనిముట్టుకోకు. నీ వదిన సుశీల చేస్తుందిలే. నీ వల్లే అది సోమరి అవుతున్నది. నువ్వు వచ్చి చేస్తావు లెమ్మని,

పొద్దుటి పూట నిద్రలేవక ఆలస్యంగా చేస్తున్నది. పొద్దెక్కి, యెండ కిటికీ లోంచి మొహం మీదపడ్డాక ఒళ్లు విరుచుకుంటూ లేస్తుంది ఆవలిస్తుంది. నా అవసరాలు చూడటం లేదు. పిల్లను కడక్కు. అలాగే వుండనీ. వాళ్లమ్మ కడుగుతుందిలే. అందాకా నిలబడనీ'' అన్నాడు అన్న వాసు.

''యేదీ? యెంతసేపాయే? పిల్ల యేడుస్తున్నది. కళ్లవెంట నీళ్లుగూడా వచ్చాయి'' అంటూ మేనగోడలు నాలుగేళ్ళ పిల్ల సూరీడుని కడిగి తీసికెళ్లి వేడి నీళ్లుపోసి వళ్లు రుద్ది తుడిచి గౌనువేసి చెడ్డీ యెక్కించి పీట మీద కూచోబెట్టి నెయ్యి వేసిన యిడ్లీల పళ్లెం ముందుంచింది. తక్కిన పిల్లలూ వచ్చారు. వారి పనీ చూసింది. పళ్లేలు కడిగి బోర్లించింది. తలలు దువ్వి పలకా పుస్తకాలందించి బడికి తోలింది.

సుశీల కాలకృత్యాలు తీర్చుకుని వచ్చి పీట మీద కూచున్నది. వదిన కాంతమ్మ వెండి తామరాకులో వేడి యిడ్లీలు రెండు వుప్మా వుంచి నెయ్యి వేసింది. అల్లప్పచ్చడి, కారప్పొడీ వడ్డించింది. మంచి నీళ్ల గ్లాసూ, కాఫీ గాజు గ్లాసూ.

''పెందరాళే లేచి పన్లన్నీ చూసుకొమ్మని చెప్పానా సుశీలా? చెప్పేది మగడు గదూ?'' అని వురిమాడు వాసూ.

''మీ ముద్దుల చెల్లెలు చేస్తుంది గదా అని. కాసేపు నిద్ర తీశానండీ. అదీ తప్పే? రాత్రి నిద్ర చాలలేదు. పిల్ల నిద్రపోనిస్తేనా? పక్క మార్చాలి. అదంతా ప్రేమేనా? ఉదారంగా చేస్తున్నదా మీ ముద్దుల చెల్లెలు? యేదో వుచితంగా కావాలి గాబోలు. లేదా యేమేం కావాలో చూసుకుని అడిగి కొన్నీ అడక్కుండా కొన్నీ పట్టుకుపోతుంది రోజూనూ. అదీ తెలివంటే. నా సోమరితనమే మీ కంటబడుతున్నది. తక్కిన ఆత్మీయులూ అంతే. వుండదలచుకున్నాళ్లు వుంటారు. సంతర్పణలకూ, పందేరాలకూ ఐవేజు సరిపోతున్నదా? జిల్లా జడ్జీలా? కనపడని దోపిడీ కనిపిస్తున్నదా? పెద్దక్క కొడుక్కి లంచమిచ్చుకుని వుద్యోగం తెచ్చుకోటానికి మూట అందించారు. నేనడ్డు పడ్డానా?'' అంటూ ఫలహారం కానిచ్చి కాఫీ అందుకున్నది సుశీల.

తినేవి వదిలేసి లేచి కొట్టబోయాడు వాసు. కాఫీ నేలపాలైంది. నెయ్యి నేల తడిపింది.

''యెంత కావరం? నీ వాళ్లొచ్చి మేసిపోవటం లేదూ? వారికి నీవు నీ నగలు చాటుగా అందించటం లేదూ? నీకు రొమ్ముల కుంపటి అనే నెత్తురు గడ్డ ఛెస్ట్ మీద నరం మీద లేచి, యెన్నాళ్లకీ మొనతేలక పగలక బాధపడుతున్నావనీ, సాయమున్నామనీ, అత్తవారి కెందుకు పడ్తుందనీ, నిందిస్తూ సుష్టుగా వండుకు తింటూ, పిండి వంటలు గూడా చేసుకు తిన్నారు. కాకరకాయలు కాయలుగా వుంచి, కొత్తిమేర కారం కూరి నేతితోనే యెర్రగా వేయించి అన్నంలో తినేవాళ్లు. నేనే మనలేదు. మా బాబాయి నన్ను దత్తు చేసుకున్నది, కన్నవారిని యేడిపించటానికా? డబ్బు పిక్కటానికా మొద్దూ? విచక్షణ జ్ఞానమేదీ'' అంటూ మీది కొస్తే లేచి యిటు అటూ పరుగెత్తింది సుశీల.

కాంతమ్మ అన్నను వాటేసుకుని పడగ్గదిలోకి నెట్టి తలుపు మూసి గొళ్లెం పెట్టింది. యేడుస్తున్న పిల్లనెత్తుకుని సముదాయించింది. ఇరుగూ పొరుగూ వచ్చారు. సుశీలను ఓదార్చారు. ఆ పూట అంతా వుండి మధ్యాన్న భోజనాలు ముగించి వెళ్లారు. కాంతమ్మ తన యింటికి వెళ్లింది. పక్కనే యిల్లు. తమ్ముడు సదాశివది. పెంకుటిల్లే.

తమ్ముడికి చదువవుతూ వుండగానే పెళ్లి అయింది. డిగ్రీ చేతికి వస్తూనే వుద్యోగం చూపించింది. ఢిల్లీ వెళ్లాడు. ఇల్లు ఖాళీగా వున్నదని తానుంటానని తమ్ముని అడిగితే వుండనిచ్చాడు తమ్ముడు. మరదలు పుట్టింట్లో వున్నది.

ఘర్షణ పడ్డారని విని సుశీల వేపు వారొచ్చారు. అక్క వాణిదేవి అన్నది. ''నీ ఆడపడుచే కారణం సుశీ నిజమాడితే నిష్ఠూరమని, నిజం పలికావని, రోషపడి చెయ్యిచేసుకున్నాడు మరిది. మీ కాపరం మీరు దిద్దుకుంటారు. ఇద్దరి మధ్యా తను దూరటమెందుకూ? వడ్డించేవాడు మనవాడనా? నువ్వు అన్నా చెల్లెలి ఆటకట్టించాలి సుశీ. లాయరు బావగార్ని సంప్రదించి యిల్లూ పొలమూ నీ పేర పెట్టించుకో. మరిది తన జీతం దానధర్మాలకి ఖర్చు చేసుకుంటాడు.

తెలిసొస్తుంది. చూసినవల్లా పట్టుకుపోతుంది. వదిన అని బెదురే లేదు. విడిదీయాలనే ప్రయత్నం. నటనేమో సద్ది శాంతింప జేస్తున్నట్టు'' అని పుల్లలు యెగసన దోసింది అక్క.

6

పెద్దాడపడచు వచ్చి కాంతమ్మను తీసికెళ్లింది.

''కూతురి కాన్పు కష్టమయేట్టున్నది. ఆస్పటల్లో చేర్పాలేమో? ఆస్పిటల్ చుట్టూ తిరగొద్దూ? ఒక్కదాన్నే అన్నీ చేయలేను మరదలా. తమ్ముడిని ఒప్పించాలే. రా'' అన్నది.

బెజవాడ వెళ్లారు. ఇబ్బంది తీరింది. మరొకావె అత్తవారి వేపే పిలుచుకెళ్లింది. వాళ్లు తమ పబ్బం గడుపుకోటానికి కాంతమ్మ యింటికి వస్తూ పోతూ వుంటారు. భర్త రామేశానికి విసుగేసి గట్టిగానే చెప్పాడు'' పనీ వంటా అన్నీ చిన్న పిల్లల నెత్తిన రుద్ది వెళ్లకు. వాళ్ల సంగతులు వాళ్లే చూసుకుంటారు'' బియ్యం యేరుతున్న కాంతమ్మ తల తాటించి, తల విసిరి యీసడించింది. ''అమ్మటానికున్న సామర్ధ్యం సంపాదించటానికి లేదుగానీ అధికారం చూపటానికున్నది వెళ్లేది నా కోసమా? నన్ను పిలుచు కెళ్లండి అని దేవిరిస్తున్నానా?''. ''నీ వాళ్ల కోసమూ వెళ్తున్నావు. ఒళ్లు తెలియదా?'' అన్నాడు. వెరపు అనేది లేదని అర్ధమైంది రామేశానికి.

7

ఓ పక్షానికల్లా కొంపజేరాల్సిన కాంతమ్మ, నెలగడిచాక వచ్చింది. అందాకా పప్పు అన్నం తినిపించాడు తండ్రి. పిల్లలే పనిచేశారు. కాపు సీతమ్మ నెయ్యి తెచ్చి యిచ్చి వెళ్లింది. గొల్లరామ పెరుగుగిన్నె పిల్లల కందించి వెళ్లింది. వెళ్తూ 'సంసారం వదిలి వూళ్లమీద యెలా తిరుగుతుందో ఆ తల్లి? నేనెటూ పోనిదే మా యత్త తాటి చీపిరి తిరగేస్తుంది నా వీపుమీద'' అనుకున్నది. వెనుతిరిగి బట్టలారేస్తున్న రామేశాన్ని చూసింది'' అయ్యా ఓనాడూ చేయి చేసుకోగా చూడలేదు. నా

మొగుడు గుద్దులేస్తాడు'' అని కళ్లు తుడుచుకున్నది.

కాంతమ్మ వస్తూనే పని అందుకున్నది. బట్టలుతికి ఆరేసింది. పిల్లలకు తలంట్లు కానిచ్చి మంచి బట్టలేసింది. తెచ్చిన నేతి అరిశలు, జంతికలు పళ్లేలలో వుంచి తినమని యిచ్చింది. పాలకాయలు కొబ్బరి లౌజూ యిచ్చింది. ఇల్లంతా శుభ్రం చేసి కడిగి ముగ్గుబెట్టి, బూజు దులిపి పక్కలు సర్ది యిస్త్రీ దుప్పట్లు పరిచింది.

అరిటికాయ కూరా, పప్పు పులుసూ, నిమ్మ వూరగాయా, అప్పడం, వడియం, పెరుగూ నేయీ వేసి అన్నాలూ పెట్టింది. రామేశమేమీ మాట్లాడలేదు. మౌనంగా వున్నాడు. దారి కొస్తాడని చూసింది. పిల్లల శ్రద్ధాభక్తులు చూసింది. నాల్రోజులు గడిచినై. వారం తిరిగింది. పక్క యింట్లోనించి చడీ చప్పుడు వినరాలేదు. గలభా గలాటా లేవు.

పొద్దు వాటారుతున్నది. వంటకుపక్రమించింది కాంతమ్మ. వదిన కామేశ్వరి రావటం గమనించి తలెత్తింది. పీట తెచ్చి వేసింది.

''కూచో వదినా. రామక్కని అత్తారు తీసికెళ్లారా'' కామేశ్వరి పీటమీద కూచున్నది. దీపం వెలిగించింది కాంతమ్మ. కూర తరగాలి. పచ్చడీ చారూ అంతే.

''ఆ తీసికెళ్లారెలాగైతేనేం. నేనూ మీ అన్న కూడా వెళ్లి దింపి వచ్చాం. అల్లుడొక్కడే వచ్చాడులే తీసికెళ్లటానికి. మీ వదిన సుశీల వచ్చిందా? నిన్ను చూడవచ్చిందా?'' అన్నది.

ఆ మాటలూ చూపూ వింతగొలిపాయి కాంతమ్మకి.

''యేమో నేనింకా వారింటికెళ్లలేదు. వదిన వూరికెళ్లిందనే తెలియదు. యేదీ యింట్లో అడుగుపెట్టుతూనే పనిలో మునిగా. మనసు పీకుతూనే వున్నది. అన్న కంటబడలేదు. నా పిల్లల్ని ముద్దు చేసే అన్నా రాలేదు. బెజవాడ నించి మరో వూరు మరో వూరు తిరిగివచ్చేప్పటికి కాలస్యమైంది''.

కాంతమ్మ కదలికలు, తలా కళ్లూ గమనిస్తూనే వున్నది కామేశ్వరి ''ఇంక

వెళ్లక్కర్లేదేమో'' అన్నది నింపాదిగా.

''యెందుకనలా అంటున్నావు?''

''రాగానే వినివింటావు. తెలిసిపోయి వుండాలనుకున్నా''

''తెలియదే. జబ్బు పడ్డారా? వదిన పుట్టింటి వారొస్తారే?'' అన్నం వుడుకుతూ పొంగి మూతను నెట్టేసింది. వంట పూర్తి అయే లోపల వదిన చెప్పిన విశేషాలు పూర్తిగావిన్నది కాంతమ్మ.

తగాదా ముదురుపాకానబడి సుశీల లాయరు బావగారింటికెళ్లి మొరబెట్టింది రాత్రి తొమ్మిది గంటలప్పుడు.

''ఆస్తంతా గుండాన బడుతున్నది బావగారూ. ఆర్జన తక్కువ పందేరం యెక్కువ. యెదురు చెప్పే హక్కే లేదు నాకు. నోరెత్తనీయడు. తనవారూ వారి యిక్కట్లు తీర్చటమే యిష్టం మీ తమ్ముడికి. పక్కనున్న చెల్లెలు సరేసరి నిలువుదోపిడీ చేస్తుంది నేర్పుగా. ఇద్దరి వద్దనించీ లాగుతుంటే'' యిచ్చాగా. ఆయనన్నీ అడుగుతావేం?'' అంటే ''యెంతిచ్చారావేమిటీ'' అని యీసడించింది. ''నీ వాళ్ల చేతుల్లో పోయటం లేదూ దోసిళ్లతో'' అని విషం కక్కింది. యేది కావాలన్నా అడక్కుండానే పట్టుకుపోతుంది. పిల్లలెదుగుతున్నారు బావగారూ. చదువులు పెళ్లిళ్లు జరగాలిగా'' అని రాగం అందుకున్నది.

''నీ పేర పెట్టేస్తా ఆస్తంతా. అప్పుడేం చేయలేడు నా తమ్ముడు. కాంత ఆటా కట్టుతుంది. అది మా యింట్లోనూ దూరుతుంది. ఒక్క వస్తువు నీకు తెలియకుండా యిల్లు దాటే వీలుండదు''.

''నాకు వివరాలు తెలియవు. మూడవనాడు మీ అన్న వాసుదేవరావు, స్వయంగా తానే వ్యవహారం ముగించాడు లాయర్నీ సాక్షుల్నీ తెచ్చాడు. దస్తావేజులూనూ. అంతా సుశీల పేరపెట్టేశాడు. అంతకు ముందే వుద్యోగానికి రాజీనామా యిచ్చేశాడుట. మాటా పలుకూ లేకుండా మాయమైనాడు

వాసుదేవరావు. బైరాగుల్లో కలిశాడో, సన్యాసించాడో, దేశం మీద పోయాడో, ఆత్మహత్య చేసుకున్నాడో తెలియరాలేదు. మనిషే ఐపు లేడు. సుశీలని పుట్టింటారు తీసికెళ్లారు. అందుకనడిగా వచ్చిందా స్వంత యింటికీ అని? పోతా కాంతమ్మా'' అని లేచి నోటికి చేయి అడ్డుంచి రహస్యంగా చెప్పింది కామేశ్వరి.

''దీనిక్కారణం నీవే నంటున్నారు వూరి వారూ బంధువులూ. నేనూ వంట చేయాలి'' అంటూ వెళ్లిపోయింది వదిన.

మూతి విరిచి తల తాటించింది కాంతమ్మ.

వడ్డన చేస్తుండగా, పిల్లలూ మగడూ వచ్చేశారు.

6

కామేశం నవ్వు మొహంతోనే అన్నాడు ''అది దొంగ యేడుపు వదినగారూ, నటిస్తున్నది మీ చెల్లెలు. దుఃఖం అభినయం పట్టుతున్నది. నా బాధ మీ చెల్లెల్ని గురించి కాదు, నా పిల్లల్ని గురించే వదినగారూ, రత్నాలంటి నా పిల్లలను గూడా, విదిలించి కొడుతూ, తూస్కారంగా మాట్లాడుతూ, వంచిస్తూ యేడిపిస్తుందేమోననే, వుండేందుకు తమ్ముడిల్లు, పీక్కు తినేందుకు వీలుగా యుడమ పక్కన అన్న లా పాయింట్లు సేకరించేందుకు, కుడివేపున జ్ఞాతి సోదరుడు. తెల్ల వాళ్ల మనస్తత్వం విన్నారా వదినగారూ? వారి నీతి తెలుసా వదినగారూ? త విభజించి పాలించు. విడదీసి వదిలిపో. పరమాత్మ వామనుడై, బలిని వంచింప వచ్చి, మూడడుగు లడిగి తీసుకుని, ఒక పాదంతో భూమి ఆక్రమించి, రెండవ అడుగుతో ఆకాశం ఆక్రమించినప్పుడు, ఆ కుడిపాదం బొటనవేలి నుండి గంగపుట్టి ప్రవహించింది. బ్రహ్మ కడిగిన పాదం అని అన్నమయ్య కీర్తన అల్లాడు. బ్రహ్మ వచ్చి పాదం కడిగి ఆ నీళ్ల తన నెత్తిన చల్లుకుని, కమండలంలోకి గంగను పట్టాడు. ఆ పరమాత్మే కృష్ణుడై ద్వాపరంలో పుట్టి గీతామృతం తన నోటినించి పుట్టించాడు. ఆ పరమాత్మే మానవులకు సంతానామృతం యిచ్చాడట. నాకు సిరినివ్వక సంతానమనే సంపదనిచ్చాడు పరమాత్మ.

వాళ్లనేం చేస్తుందో. వాళ్లనీ రహస్యంగా నేర్పుగా పీడిస్తుందేమో ప్రాణం విసిగి దేశం మీద పోతారో, మతి చలిస్తుందో! నే పోగానే మా వాళ్లు, ఆచార ప్రకారం నీ చెల్లికి కేశఖండన జరిపించినా మారదు మీ చెల్లెలు, వదినగారూ''.

''అలా అనకు రామేశం నాయనా! నిండా నలభైయేళ్లు లేవు. యెంత ధృడంగా వున్నావు'' అని తలమీద రాస్తూ అన్నది పెద్ద వదినగారు కమలాంబ.

ఈ మాటు విచారంగానే చూస్తూ అన్నాడు మరిది. ''తీసుకుపోవటానికే పట్టుకున్నాయీ భేదులు వదినగారూ. నిన్న మొదలు లేచి తిరగనిచ్చినై. ఇవాళ పడక వేయించినై. రేప్పొద్దున్నే తీసుకుపోతాయి వదినగారూ, ప్రేమ నటిస్తూ నాటు వైద్యుడు శేషయ్య మామతో చెపితే ఆయన ''యేదో అరగలేదు. నీళ్లు నెట్టేస్తున్నది అరగనిది. ఈ మాత్రవేయి. కట్టుకుంటాయి'' అని ఓ మాత్ర యిచ్చాడు. అది తెచ్చి మింగించింది నా చేత.

''నా చేతి మాత్రా వైకుంఠ యాత్రా అని నన్ను పంపుతున్నావా? పోతాను. నీతో నీ తమ్ముడింటి కొచ్చానా? పంపేస్తే పోతాను. నా పిల్లల్ని వదిలి పోవాలని లేదనుకో. ఇంక నన్ను నువ్వు, యింటికి రాగానే యింట్లో లేడే మగడూ అని, వెతికి పట్టి తెచ్చి నీ తమ్ముడింట్లో కట్టేయలేవు గొడ్డును వెతికి తెచ్చి రాటకు కట్టినట్టు యెటో పోలేవు అన్నాను వదినగారూ. నేను కృష్ణా పుష్కరాలకి వెళ్లాను వదినగారు. పరవడి దినాలు గదూ, యెప్పుడు వస్తాయూ పుష్కరాలూ, పన్నెండేళ్లకోసారి వస్తాయి. పులివేటకెళ్లి వచ్చినట్టు వచ్చి, కూపీ అంటున్నది కమలాంబ. లాగి వచ్చి, కృష్ణా స్నానం చేస్తున్నవాడిని పట్టి బెల్లించి, వినయం నటించి, తెచ్చి, దొడ్లో చెట్టును పాతినట్టు, యింట్లో నన్ను పాతింది మీ చెల్లెలు వదిన గారూ. ఈ మాటూ రాలేదు నేనున్నచోటికి. నన్ను పట్టితేనూ తేలేదు వదినగారూ! '' కాంతమ్మ వున్నవేపు తల తిప్పి చూశాడు రామేశం. కాంతమ్మ కిందబడి పొర్లుతూ శోకిస్తున్నది. ''రాగలవా?'' అన్నాడు. దగ్గర కూచుని చూస్తున్న ఆర్నెల్ల కూతుర్ని చూశాడు.

నల్లని జుట్టున్న తల తన ఒడిలో పెట్టుకుని నిమురుతూ, కన్నీరు నింపుతూ ఓదార్చింది కమలాంబ వదినగారు. ఆమె రెండవ అల్లుడు సుందరేశ్వరుడు, సినీ ఫీల్డులో కెళ్లగలిగి రెండు చేతులా సంపాయిస్తూ న్యుమోనియా తాకి తొమ్మిదో రోజు పోయాడు మద్రాసులో. ప్రైవేటు కారులో స్వంత వూరు స్వంత యింటికి తెచ్చి అంత్యక్రియలూ కర్మలూ చేశారు. తమ్ముడు వాసుదేవరావు మాయమ్మై యాడాది వెళ్లింది. అల్లునికి త్రైమాసికం పెట్టించి యీ వూరొస్తే మరిది అనారోగ్యం తెలిసివచ్చింది కమలాంబ. ఆనాడు భారతదేశ సగటు వయఃపరిమాణం ఇరవై ఒక్క యేళ్లు. మంచి తిండీ లేదు. మందులూ లేవు. నలభై బతికితే గొప్ప. టైఫాయిడ్, న్యుమోనియా, క్షయ తీసుకుపోతున్నాయి.

''రాలేవు. అక్కడికి రావటం నీ చేతులో లేదు. దేవుడు పిలవాలి. నువ్వు శతాయుష్మంతురాలివని నీ జాతకం చెప్తున్నది''.

''నాయనా రామేశం. అలా నొప్పిగలిగేట్టు మాటలాడరాదు''.

''యెవరిల్లన్నా ఆక్రమించటంలో వున్న ఆసక్తి, యిల్లు అమ్మించటంలో వున్న సమర్థతా, ఉన్నదానితో తృప్తిగలిగి వుండటంలో లేదు మీ చెల్లెలికి వదినగారూ. డబ్బు వెంట పరుగెత్తద్దని చెప్పండి మీ చేతనైతే. వింటుందేమో చూతాం. నా మిగిలిన భూమీ అమ్ముతుందేమో. మైనర్లు నిరాధారమౌతారు. యెవరినెత్తినన్నా రుద్దుతుందనుకోండి. చులకనౌతారు నా బిడ్డలు''.

7

వేద పాఠశాల ఆనరరీ ప్రిన్సిపాల్ రామేశం గారు మరునాడు ముక్కోటి ఏకాదశినాడు సూర్యోదయమయాక తనువు వదిలారు. చాప మీదే వున్నాడు. వూరంతా వార్త పాకి ఆశ్చర్యం కలిగించింది. శిష్యులు,

''అరె! యెలా పోతారు? బాగా ఆరోగ్యంగా వున్నారే. అనధ్యయనమని శలవిస్తే మా గ్రామం వెళ్లి వచ్చాము అంతే'' అన్నారు. అంత్యక్రియలలో పాల్గొంటున్నారు. కొంతమంది పాలెం పరుగెత్తీ, పాటిమీద కెళ్లీ సంబరాలు

సేకరించ సాగారు. పెద్ద కర్మనాటికి లోటుండగూడదు.

మరికొంత పొద్దెక్కుతుండగా రామేశం పెద్దక్క కొడుకు మద్రాసునించి వచ్చాడు. రైలు లేటు. తెల్లారు జామునే రావాల్సింది. మెడిసిన్ పూర్తయి, హౌస్ సర్జన్ చేశాడు. వుద్యోగం వరించింది. పొంగిపోతూ మేనమామను చూచి మొక్కి దీవనలందుకోవాలని వచ్చాడు. తల్లి పేరు కాశీరత్నం. మేనల్లుడు పేరు దక్షిణామూర్తి. భర్తపోతే పుట్టింటి కొచ్చింది కాశీరత్నం పెద్దప్ప.

కొద్ది వివరాలు విన్నాడు దక్షిణామూర్తి. ''మామయ్యా! అలా పోరాదు. మా నాన్నపోతే మమ్మల్ని ఆదరించావు. నన్ను ముద్దు చేశావు. పెద్ద చదువు చదవాలని ప్రోత్సాహమిచ్చావు'' అని కూలబడి అక్కడున్న వారిని చూస్తూ అన్నాడు, అదొకరకం డయేరియా. అంటుకున్నది మొదలు ఒంట్లో వుప్పంతా కొట్టుకుపోతుంది. పల్చని మజ్జిగలో వుప్పు కలిపి తాగించాలి, ఉప్పు సద్దుకుని బతికేవాడు. మామయ్యకు చిరుతిండీ టిఫిన్లు అలవాటు లేవు. అలవాటులేని జొపోసన పడితే మూతి మీసాలు తెగ్గాయట. యేదైనా అరగనిది తిన్నాడేమో. అది చెడుచేసి వుండాలి. మధ్యాహ్నం రాత్రీ, భోజనం అంతే మామయ్యకు అలవాటు. భోజనం కూడా పప్పు అన్నం నిమ్మకాయ వూరగాయ కొత్తదీ నెయ్యీ పెరుగు అంతే. అత్తయ్య తెచ్చి తినిపించిందేమో. ఆమె అన్నీ హరాయించుకోగలదు. మామయ్య తిండి సంగతి తెలుసే అత్తయ్యకి'' అలా పేలాడు. మౌనంగా చూసి స్నానం చేసివచ్చి పాడె మోయటానికి నాల్గవవాడుగా బుజానికెత్తుకున్నాడు కుమారస్వామి నిప్పుకుండతో ముందు నడిచాడు. కాంతమ్మ అవిలిగాకుండా యేడుస్తుంటే బంధువులు పట్టుకున్నారు.

7

రామేశం గారి జోస్యం నిజమైంది. నాలుగునెలల తర్వాత కాంతమ్మను మరదలు అనూరాధ తన తండ్రితో వచ్చి

''మీ తమ్ముడు ఢిల్లీలో వుద్యోగం మానేసి, బొంబాయిలో అంతకంటే

పెద్ద వుద్యోగం, స్టెనో టైపిస్ట్ దొరికితే వెళ్లారుట, వదినగారూ. ఇల్లు తాకట్టు పెట్టి ఆ డబ్బు తీసికెళ్లారుట. వాళ్లా డబ్బు అవసరం వచ్చిందట. అయినకాడికమ్మేసి నాన్నను తోడు తీసుకు రమ్మన్నారు. అమ్మకం రాతకోతలు ముగించాడు మా నాన్న. కోమటి కొండయ్య యిల్లు స్వాధీనం చేయమంటున్నాడు. మీరు మీ మేనత్త చెల్లమ్మగారి పూరిపాకలోకి మారచ్చని మా నాన్న అంటున్నాడు. ఆమె పోయి నాలుగేళ్లయింది. నాలుగొందల గజాల స్థలం పాకా ఖాళీగానే వున్నాయి. దొడ్లో మంచినీళ్ల బావి వున్నది''.

''అలాగే అనూ యివాళే మారుతా. నేనే మారగలను? చాలా అమ్మేశాగా కర్మకాండలకు. పుట్టింటి దీపం చూడటం వేడుకా ముగిసింది. రవికా జుట్టూ తీయించారు అత్తారు కనపడుతున్నారా'' అన్నది కాంతమ్మ.

## 7

తరవాత ఏకాగ్రత అంత బాగా లేదు చారుమతికి. యోగం నిలిచిందంతే. యేవో బొమ్మలు అంతరిక్షయానం మరేవో అర్థంగాలేదు. పెద్ద కొడుకు కుమారస్వామి డిగ్రీ అందుకుని మిషనరీ కళాశాలలో భౌతికశాస్త్రం నేర్పే ఆచార్యుడైనాడు. వర్ణాంతర వివాహం చేసుకోబోతున్నాడు. ఆనాటి యువతరం జాతీయ వుద్యమంలో చేరటమో, సంఘోద్ధరణ చేయటమో చేస్తున్నారు. ఉరకలు వేసే వయసు అలా చేయిస్తున్నది. పెళ్లి కూతురు గణితశాస్త్రం నేర్చి కొత్తగా అదే కళాశాలకి నచ్చింది. ఆమే కుమారస్వామితో స్నేహంగా వుండి, పెళ్లి మాటెత్తి ''అనుకూలంగా వుంటానండీ'' అని వాగ్దానం చేసింది. పేరు చంద్రావతి. సంఘోద్ధరణ చేస్తున్నాడు కుమారస్వామి అని కళాశాల ముఖ్యాచార్యుడు అబ్రహామ్ శాస్త్రి సంతోషించాడు. బాగా ప్రోత్సాహమిచ్చాడు. ఖర్చులు తనవి అన్నాడు.

చంద్రావతి తాత మంచి వుద్యోగం చేయాలని, ఈశపుత్రమతం పుచ్చుకున్నాడు. గొప్ప వుద్యోగి అయినాడు గానీ తనలాగే మతం పుచ్చుకున్న

అమ్మాయిని పెళ్లాడి మెప్పు పొందాడు గానీ భూములూ సంక్రమించాయి గానీ చిన్న చూపూ తగినంత ఆదరగౌరవాలు కోల్పోయి, అన్ని మతాలూ ఒకటేనని తెలుసుకున్నాడు. ఆనాడు చాలామందికి అదే అనుభవం కలిగింది. మైకేల్ మధుసూదన దత్ తన మతము, తమ బాషా, తమ సంస్కృతే గొప్పదని తెలుసుకుని తమ మతంలోకి రావాలని ప్రయత్నిస్తే వీలుపడలేదు. గురువు వూరడించాడు. వాదించాడు.

'' ఆంగ్లం చదివి మురిసి పోతివే దత్'' అని హాస్యమాడాడు.

''బెంగాలీ భాషలో మేఘనాధ వధ బ్లాంక్ వర్స్ రచించే వీలున్నది'' అంటుంటే మిత్రుడు ఛాలెంజ్ చేశాడు. ''దత్తా! నువ్వు మేఘనాద వధ బెంగాలీలో బ్లాంక్‌వర్స్ రచించు. నేను నా స్వంత డబ్బుతో దానిని పబ్లిష్‌చేయించి అమ్ముతా. లేకపోతే వుచితంగా పంచుతా'' దత్తా కవనం అల్లాడు. మిత్రుడు తన మాట నిలబెట్టుకున్నాడు. కాలం గడుస్తుండగా మరొక మిత్రుడు మైకేల్ మధుసూదన దత్తుని '' ఒక అందమైన నాట్యగత్తె నాట్యం అభినయుం చూద్దువుగానిరా'' అని తీసికెళ్లాడు. వీరు వెళ్లేప్పటికే ఆటాపాటా సాగుతున్నాయి. హాలు నిండింది. వీరిద్దరు చోటుచూసుకుని కూర్చున్నారు. వీరిని గమనించినా, నాట్యగత్తెకు ఆ వచ్చింది దత్తా అని తెలియదు. యెన్నడూ చూచి వుండలేదు. కొన్ని అభినయించి, పాడి ఆడి నిలబడి మేఘనాధవధ పాడుతూ అభినయిస్తూ ఆడసాగింది. మైకేల్ మధుసూదనదత్ కళ్లప్పగించాడు.

'' ఇంతగా ప్రజల మధ్యకి చొచ్చుకెళ్లిందా నా కవిత!'' అని ఆశ్చర్యపోయాడు. ఒళ్లు పులకరించింది.

కాశ్మీరులో చాలామంది తెలియక ఈశపుత్రమతం పుచ్చుకుని లోపాలూ గ్రహించి అవమానాలు భరించలేక మళ్లా స్వమతంలోకే వచ్చేద్దామంటే అవకాశం లేదన్నారు పండితులు. వారంతా తమ ప్రభువుతో మొరపెట్టుకున్నాడు. పండితులు ప్రభుపునూ యెదిరించారు. ''నా ప్రజలీలా యేడవాల్సిందేనా వారి మొరలినే వారు లేరా'' అనడిగాడు ప్రభువు. అపుడు దయానంద సరస్వతి

అనే మహామహుడు ''ఉన్నది. గ్రంధాల నుంచి యెత్తి చూపించగలను'' అని శుద్ధిమువ్ మెంటని ప్రారంభించి చేరదలచిన వారందరిని స్వమతంలోకి తెచ్చాడు. ఆ సమాజం పేరు ఆర్య సమాజ్. ఏకేశ్వరోపాసన, వర్ణ భేధం లేక అందరం దేవుని బిడ్డలమే అనుకోటం పంక్తి భోజనం కలిసి ప్రార్ధన అలవాటు చేశాడు. దయ, సత్యము, శౌచము, సన్మార్గము, సత్ప్రవర్తన, దాక్షిణ్యభావమే సిసలైన మతమని చెప్పాడు. ఆర్య సమాజ్ బాగా వ్యాప్తిలో కొచ్చింది. రాజారామమోహనరాయ్ బెంగాలీ. బహుభార్యాత్వం, సహగమనం, విగ్రహారాధన, కర్మకాండలు, వర్ణభేదం నిరసించి బ్రహ్మో సమాజ్ అని నడిపాడు. జైన బౌద్ధాలల్లే యీ రెండు వ్యాపించాయి. పాలకుల సాయంతో సహగమనం ఆపించాడు రామమోహన.

ఈ రెండవ సమాజ్ ఆంధ్రా అంతా పాకుతున్నప్పుడు చాలా మంది దానిని పుచ్చుకుని, దానిలో చేరి ఆ పద్దతులు అవలంబించారు. వారితో కలిశాడు చంద్రావతి తాత. ప్రాణం తెరిపినబడింది. కూతురు కోమల పెరిగి అందంగా తయారై వైద్య శాస్త్రం చదువుతూ ఒక భాగ్యశాలి నాకర్షించింది. నిరంజనవర్మ కోమలా బ్రాహ్మో సమాజ్ పద్ధతిలో పెళ్లి చేసుకున్నారు. వర్మా బ్రాహ్మో సమాజ్ పుచ్చుకున్నాడు. వారికి నలుగురు సంతానం కలిగింది. మొదటి బిడ్డే చంద్రావతి నిరంజన్ వెలమలు. ధర్మాసుపత్రి నడిపాడు. అంటువ్యాధి సోకి అర్ధాంతరంగా పోయాడు. అతని వేపువారు తమది సమిష్టి కుటుంబమనీ బ్రాహ్మో సమాజ్ పెళ్లి చెల్లదనీ కోమలకి నిరంజన్ భాగం భూములు రావనీ దావా వేశారు. కోమల కాంగ్రెస్ పార్టీ సభ్యురాలైంది. పెద్దవాళ్లా పరపతిగలవారితో పరిచయం సంపాయించింది. తల్లిదండ్రులామె వద్దే వున్నారు. నిరంజన్ భూమి స్వాధీనం అయింది. స్వంత వ్యవసాయం చేయిస్తున్నారు. యిల్లు వారిదే. ''నేను మీ మతంలోకి వస్తా రానిస్తే'' అని చంద్రావతి సరసమాడితే కుమార స్వామి మీ బ్రాహ్మో సమాజ్‌వాడినే సెలెక్టు చేసుకుని పెళ్లాడుదూ. మా మతం కఠినంగా వుంటుంది. తట్టుకోలేవు'' అన్నాడో లేదో, ఆ అమ్మాయి, నవ్వటం మానేసి

యేడుస్తూ అతని పాదాల మీద చేతులుంచి ''అనుకూలంగా వుంటా. సంపాదన మీ చేతులో పోస్తా సాయంగా వుంటా. మీ ఆచారాలు పాటిస్తా అవెంత కఠినంగా వున్నా సరే'' అన్నది. కుమారస్వామి లేవదీశాడు. ''విగ్రహారాధన చేయలేవేమో'' అన్నాడు. ''చేస్తా చేస్తా అన్నది'' వాటేసుకుని మొత్తానికి గెలిచింది. వాళ్లమ్మను ఒప్పించే చేసుకున్నది. మరుసటేడు కొడుకు. వాడిని పైకెత్తి పట్టుకుని కుమారస్వామి ''నీవే మతం? రామేశం?'' అనడిగితే ఆర్నెల్ల రామేశం బోసినవ్వులు ఒలకపోశాడు.

''అన్నీ ఒకటేనని నవ్వుతున్నాడు రామేశం'' అన్నాడు స్వామి. కాంతమ్మ మోడరన్ వుమన్‌లాగా, కల్చర్డ్ లేడీలాగా మెలిగినా దైవం మెచ్చలేదేమో. స్వామికి వూపిరితిత్తులలో ఇన్‌ఫెక్షన్ వచ్చి సన్నని రంధ్రాలేర్పడి, క్రమంగా ఆయాసపడసాగాడు. ఒకనాడు పడకవేశాడు. మెల్లిగా రక్తంపడింది స్పిట్టూన్‌లో. అంతా పదినెలలు. పెద్ద డాక్టర్లు కృత్రిమ శ్వాస కల్పించినా లాభం లేకపోయింది. తెలివి తప్పలేదు. బ్రెయిన్ బాగానే పని చేస్తున్నది. పెత్తల్లి, తక్కినవారూ తండ్రివేపు వారూ వచ్చారు. పెత్తల్లి కమలాంబకు దుఃఖం ఆగలేదు. తావుంతా కలిసివున్నప్పుడు తనకు మాలిమి అయినాడు స్వామి. వాడి తల తన ఒళ్లో వుంచుకుని ఓదారుస్తూ ఆగకుండా వచ్చే కన్నీరు కొంగుతో అద్దుకుంటున్నది.

'‘పెద్దమ్మా! మా అమ్మ కిందబడి పార్లి పార్లి యేడుస్తున్నది గదూ. అది అభినయమే. మా నాన్న ముందూ యిలాటి అభినయమే చేసింది. అలా యేడవాల్సింది నేను పెద్దమ్మా. యెంతో పైకి వచ్చి నా కన్న చిన్నవాళ్లనూ తల్లినీ సుఖపెట్టాల్సిన నేను పోతున్నాను. అలా మా అమ్మలాగా అభినయించేవాళ్ల శతాయుష్మంతులౌతారు. త్వరగా మరిచిపోతారు. మహోదయమని పదకొండేళ్లకోసారి వస్తుంది. అమ్మ అంతా మరిచి నన్ను మరిచి నలుగుర్నీ వెంటేసుకుని వెళ్లి సముద్రస్నానం చేయించి తాను చేసి పుణ్యం మూటకట్టుకొస్తుంది. మచిలీపట్నానికి సముద్రం దగ్గరే. పన్నెండు మైళ్లు. అంతే మనుషుల్ని వూదరపెట్టి వారి చేత వదిలించటంలో దిట్ట గదూ మా అమ్మ!

అమెకామే సాటి ఆ విషయంలో. పెద్దమ్మా నా తమ్ములూ చెల్లెలూ బాగా చదువుతూ క్లాసు ఫస్టు వస్తున్నారు. ఆ తెలివితేటలు వేరు పెద్దమ్మా. వాళ్లకి మా అమ్మ తెలివి రాలేదు. వాళ్లనేం చేస్తుందో నే పోగానే వాళ్ల చదువులేమౌతాయో? వారినేం చేస్తుందో రైల్వే స్టేషన్లో కూలీలుగా పనిచేయిస్తుందేమో. రైలు వెంట పరుగెత్తి లగేజ్ మోస్తారేమో. డబ్బు కంటబడాలి అదీ ముఖ్యం మా నాన్న వేదపాఠశాల ఆనరరీ ప్రిన్సిపాలైనా. పేరు తెచ్చుకున్నాడు. గౌరత కోల్పోలేదు. తెలియని అంశాలు యెవరడిగినా విడమర్చి చెప్పేవాడు మా నాన్న బాలగోపాలమా ముద్దర అని చిటికెలు వేస్తూ పాడితే మృదంగ విద్వాంసుడు మెచ్చాడు. మేఘ గర్జనలాగా వుందన్నాడు మా నాన్న గొంతు. తాళం తప్పలేదన్నాడు. నేను మా నాన్న దగ్గరకు పోతా''.

కమలాంబ పమిట కొంగుతో విసురుతూ, నుదుటి మీద రాస్తూ జుట్టు సరిజేస్తూ వూరడించింది. ''నానా! స్వామీ అలా వేదన చెందకు. వ్యథ పెంచుకోకు. దైవమున్నాడు. నిర్బలులను, నిస్సహాయులను, అమాయకులను కాపాడుతాడు. నారు పోసినవాడు తప్పక నీరు పోస్తాడు స్వామీ! నాన్నా! నిండా ఇరవై నాలుగేళ్లు లేవు. యెంత తెలివి? యెంత వివేకం? యెంత చదువు? యెంత దయ! స్నేహానికి ప్రాణమిచ్చావు. నీ స్నేహితులు వస్తున్నామని తీగటపా పంపారు. అలా మాటాడకు. తల్లిని నిందించకు'' అని కన్నీరద్దుకున్నది.

''డబ్బు కోసం దైవాన్నీ వంచిస్తుందేమో పెద్దమ్మా. డబ్బు పాపాల్ని కడుగుతుందంటుంది. కడుగుతుందా. హరిర్వరతి పాపాని'' అంటుండగా కళ్లు మూతలు పడినై స్వామికి.

10

వెల్తురూ చీకటీ లాగా సీనరీస్ పరుగెత్తు తున్నాయి చారుమతికి తల దిమ్మెక్కుతున్నది. సమాధిలోంచి లేవాలనీ యీ ప్రపంచంలో తిరగాలనీ కోరిక బలీయమౌతున్నది.

రెండవ కొడుకు నరహరిని స్నేహితులు ఆటపట్టించారు. ''నరా! మీ కాంతమ్మ తల్లిగారు నిన్ను గూడా మూసలోపోసి మీ నాన్నగారిలాగా తయారు చేస్తున్నారు. నిన్ను నీవు యెలా కాపాడుకుంటావో మరి చూడాలి. ప్రయత్నాలు జరుగుతున్నాయి. వుద్యోగస్థురాలైన చంద్రావతి వద్దకు వెళ్లి పలవలా యేడ్చి విలవిలలాడి, ''అత్తగారికి పెన్షనివ్వాలి నువ్వు'' అని ఒప్పించి వచ్చారు. తన స్వేచ్ఛకు భంగం రాకుండా, నిన్ను యింటిపట్టున వుండేట్టు చేయబోతున్నారు. పెళ్లామనే గుంజకు కట్టబోతున్నారు. కాస్కో మగబిడ్డవైతే, క్రికెటర్‌లాగా, స్పోర్ట్స్‌మన్ లాగా వుంటావు. తెలుపు, అందమైన క్రాపూ. వుక్కు కడ్డీ. జిర్రున చీదవు'' అని కవ్విస్తుంటే నరహరి వారిని కొట్టబోతే పారిపోయారు.

మరోసారి ప్రకాశరావు, నిలబడి చూస్తున్న నరహరికెదురుగా నిలబడి నవ్వుతూ, పారిపోయిన స్నేహితులలాగే అడిగాడు. ''బ్రదర్! సపోజ్ వాళ్లు పారిపోక అందివుంటే యేం చేస్తావు?''

నరహరి తీవ్రంగా చూశాడు. ''సడ్డి విరుగతన్నివుండేవాడిని. మూతి మీద ఫెడీమని కొట్టి పళ్లు రాలగొట్టి వుండేవాడిని. కాళ్లు విరుగ గొట్టేదన్. తలకాయ వూడగొట్టేదన్'' అని పోతుంటే అటే చూశాడు నరహరి.

శాంతించి యింటి ముఖం పట్టాడు నరహరి. తల్లి యెదురుగా వచ్చింది. నిలబడిపోయాడు.

అది గ్రీష్మం. ఆటే పొద్దెక్కకపోయినా యెండ తీవ్రంగానే వున్నాది. రోహిణీకార్తె ప్రవేశించి నడుస్తున్నది. తొలకరి పడింది. భూమిలోని వేడి పైకి వస్తున్నది. వానపడబోయే ముందు వుక్క పోస్తున్నది.

''భోజనానికి యింటికి రావు. చిన్న సన్నాసుల్ని తరిమి ''వెతికి పట్టుకు రండి'' అనాలా!'' అన్నది. మాటల్లో మార్దవమూ లేదు. ఆదుర్దా లేదు సరిగదా. దాష్టీకం వెల్లడైంది. కొద్దిగా కదుల్తూ దెప్పుతున్నది తల్లి.

''అంతా వూడపీక్కోటానికే రాలేదే అని యెదురు చూస్తావు. నేను

హోటల్లో తినగలను. అక్క రక్తస్రావమై పోయినప్పుడు, దాని మగడు గోపాలరత్నంగారేమని మొత్తుకున్నాడో గుర్తు చేయనా? అంత్యక్రియలకు సాయపడాలని వచ్చినవారంతా ఆశ్చర్యపోయారు ఆయన మొత్తుగోళ్లు విని.

''వరలక్ష్మీ! రెంటచింతల హాస్పటల్లో ప్రాణాలు పారేసుకుని వచ్చావా? చిన్న చిన్నవి పారేసుకుంటే యేడుస్తానని మళ్లా కొనిచ్చేవాడిని. చింకిచేటంత మొహం చేసుకుని నన్ను వాటేసుకునేదానివి. పధ్నాలుగేళ్ల వరలక్ష్మీ అనే అమ్మాయి నా యింట్లో అడుగుపెట్టిన నాటి నించే, నాకు సిరి యెత్తుకున్నది. నీ పొదుపరితనం, శుచీ, శుభ్రతా, నిదానం, సమర్ధతా, నా జీవిత నౌక సంసార సముద్రంలో తాకే ఆటుపోటులకు తట్టుకుంటూ ప్రయాణం సాగించింది. అనాయాసంగా ఆరు పెళ్లిళ్లు చేశాను. యెవరు వచ్చి వెళ్లినా, యెన్ని కలతలు వచ్చినా, అవమానాలు జరిగినా నీ అండదండతో తట్టుకుంటూ వచ్చాను. దరిద్రమెరుగను. పిత్రార్జితం కోల్పోలేదు. వరలక్ష్మీ మీ అమ్మ నన్ను నిలువునా దోచింది. దోపిడీ దొంగలూ, దార్లు కాచేవారూ నయం. తానే నా వ్యవహారాల్లో తలదూర్చి ఐవేజీ తెచ్చి చేతులో పోస్తున్నట్టు నమ్మిస్తూ, నాకు తెలిసి కొంతా తెలియకుండా కొంతా స్వాహా చేసింది. చేతులోనిదంతా లాగేయడంలో, ఖర్చు చేయించటంలో నేర్పరి మీ అమ్మ. నీకు సీరియస్ అని వైరిస్తే ఆరుగుర్ని వెంటబెట్టుకొచ్చింది. కాన్పు అయేట్టులేదని డాక్టరమ్మ వున్నదని, సిజేరియన్ ఆపరేషన్ చేసి బిడ్డను తీసేస్తుందనీ, బిడ్డ తిరగటం లేదనీ తీసేయించాలనీ వూదరపెట్టి, కారు తెప్పించి నిన్ను తీసికెళ్లి అడ్మిట్ చేయించింది. వరలక్ష్మీ ప్రాణాలు పోయినవైయ్యా? పారేసుకున్నావా? కొనిస్తాననుకున్నావా? యివ్వగలనా? వరలక్ష్మీ నా యిల్లూ పొలం అమ్మిస్తుందేమో మీ అమ్మ యెవరు దిక్కు? లోభికి మూడందాల నష్టం అంటారు. బదిలీ అయి స్వంత యిల్లు వదిలి వచ్చామా ''యిల్లు రిపేర్లు కోరుతున్నది. బాగు చేయిస్తాను'' అని నా యిల్లు ఆక్రమించి యింటిపన్ను అనీ, రిపేర్లకనీ చాలా గుంజింది. మరో ఘోరం వరలక్ష్మీ నీ కిచ్చిన సారె అని పాత్రలు గిన్నెలు గోతంలో వేసి బిగించింది మీ

అమ్మ. తానిచ్చినవి తనకే చెందుతాయట. ఈ న్యాయం బాగుందా? వరలక్ష్మి నా పిల్లల నేం చేస్తుందో మీ అమ్మ పిల్లల కోసమన్నా లేచి మాటాడు వరలక్ష్మీ!'' అని దయనీయంగా యేడుస్తూ పెళ్లాన్ని గుండెలకత్తుకున్నాడు.

పెద్ద చెల్లెల్ని చూసివద్దామని కతెవరం వెళ్తే అది యేడుస్తూ, ''అన్నయ్యా! వచ్చావా? అమ్మ వచ్చి వెళ్లింది నీకు తెలిసిందా? రాగానే డబ్బు అందివ్వలేదని చిర చిరలాడి, దూషించి, ''నీ మగడు, మాగాని భూములమ్మి తన అన్న చేతిలో తల్లి చేతుల్లో పోస్తున్నాడే, యీ వూరు రైతులు, జుజ్జూరు రైతులే చెప్పారు. వారికి దావాలాడుకోమనిచ్చాడట. నా కివ్వటానికేనా నీ యిబ్బందులు యేకరువు పెడుతున్నావూ?'' చేతులో వున్నప్పుడిస్తాలే అంటావు'' అని వెళ్లిపోతుంటే, అన్నయ్యా! ''అమ్మా! రేపు నాకు స్నానం. స్నానం చేయించి వెళ్లు. లేకపోతే కాలవకెళ్లి స్నానం చేయాలి. కాలవనిండా నీరొచ్చింది. నాకు భయం. వదిలి వెళ్తే పిల్లాడు యేడుస్తాడు. తీసికెళ్లి ఒడ్డునుంచితే తానూ దిగుతాడు కాలవలోకి అమ్మా పోవొకు. అల్లుడు రాగానే యిస్తాడు. చేతులో పడగానే యిస్తా. కొల్లూరు వెళ్లాడు కోర్టు వ్యవహారంట'' అని మొత్తుకుంటుంటే అన్నయ్యా! ''చాకల్ది పోస్తుంది'' అన్నది. ''పొద్దెక్కి వస్తుందన్నా వినిపించుకోలేదన్నయ్యా!'' జీతగాడు తోడు వస్తాడు. ''పిల్లాడిని పట్టుకోమను'' అని తల విదిలించి మూతి విరిచి, వెళ్లిపోయింది గొణుగుతూ, మెటికలు విరుస్తూ, తల్లేనందామా?'' అని కళ్ల తుడుచుకున్నది.

నాకు పెళ్లి చేసినా, నా పెళ్లాం కాళ్లకి పెద్ద యినపగడియ వేసి, యెటూ పోయేందుకు వీలు లేకుండా చేసి, వంటా పనీ దాని నెత్తిన రుద్ది, పైసా కంటబడగానే దాని చేతిలోంచి వడపీక్కుని, యిల్లు పట్టకుండా తిరుగుతూ, నీ స్వేచ్ఛ కాపాడుకుంటావు. ఆ పథకం పేరు పెళ్లి. అంతేనా! ఒంటి మీద మంచి చొక్కా గూడా వుండనీయవే. ఖద్దరు సిల్క్ లాల్చీ కుట్టించుకుని వేసుకుంటే, నేను నిద్రలో వుండగా దాన్ని చాకలికి వేశావు. వాడు దాన్ని నెలరోజులు వాడుకుని చింపి తెచ్చాడు. వాడినేమనక పోగా అన్నం వేసి పంపావు. వాడితో

ముచ్చటలేమిటి? యేమి సంబంధం అది?''

''వదిన పనిపట్టావూ? పెన్షనివ్వాలి అత్తగారి కన్నావుట. ఆమె మతం మారలేదే. వాళ్ల సమాజ్‌లోనే వున్నది. కులంలేని దాన్ని తెచ్చుకున్నావా అన్నతల్లివే నువ్వు. డబ్బు గుంజటానికి కులం ప్రసక్తి లేదు. యేం? నీ తమ్ముడొకడు. ఛటాచోర్. నా చిన్న బావని లూర్ చేస్తున్నాడు. చమ్డాలూడదీస్తా నా సంగతి తెలియదేమో. ''నీకు కరణీకం చేయటం రాదు. మున్సబుగానూ పనికి రావు. వాటికి వ్యవహారజ్ఞానం వుండాలి బలరామ్. లెక్కలు రావు నీకు. వ్యాపారం నడుపుదాం. భూములమ్మి మూట తీసుకురా. మీ అన్నకు యిచ్చే అప్పు తిరిగి రాదు బలరామ్! అంటున్నాడు. వావీ వరసా లేవాయేం వర్ణభేదమూ పాటించడల్లే వున్నది. డబ్బే కులమేమో. డబ్బున్నదాన్నే పడుతున్నాడు. మీ యిద్దరి ఆశయాలూ ఒకటే. వుద్యోగాలు మారుతున్నట్లు సిటీస్‌లో వుంటున్నట్లు భ్రమ కల్పిస్తున్నాడు. మెడ్రేసు. మెడ్రేసు. నా తోడబుట్టిన చిన్న సన్నాసుల్నీ పలకిలంలో కీడ్చేట్లున్నావే. నా చిట్టి చెల్లెలు వాడితో తిరుగుతున్నదే? నీవు వాడి నుంచెంత లాగుతున్నావు? దానికి నీ నైజం తెలిసేప్పటికి దాని చేతులు కాల్తాయేమో. అప్పుడాకుల కోసం చూస్తుందేమో. ఆ దగుల్బాజీ స్వంత వారి తిట్లకు లంకించుకోగానే రహస్య సమావేశాలు యేర్పాటు చేశాడు. ఫ్లెష్ ట్రేడ్ బిగిన్ చేశావా? వాడి పిలక నీ చేతులో చిక్కిందా? యెంత రాలుస్తున్నాడు?''

కాంతమ్మ భోళ్లుమని యేడుపందుకుని తలొంచుకుని, నోట్లో కొంగు కూరుకుని, కళ్లు అద్దుకుంటూ వెళ్లిపోయింది. అటే చూశాడు. కొడుకు నరహరి.

## 11

తెరిపి మరుపుల్లో వున్నట్లు చారుమతి కళ్లు తెరుపుడుబడ్డాయేమీ గుర్తు రాలేదు. స్క్రీన్ మీద రకరకాల బొమ్మలు పరుగెత్తుతున్నాయి. ఇరవైయేళ్ల యువకుడు సుధాకర్, యమ్మెస్సీ ఫస్ట్‌క్లాసులో పాసైనవాడు, నవ మన్మధుడల్లే వున్నవాడు కాంతమ్మ నడుగుతున్నాడు.

''నేను చారుని పెళ్లాడుతాను అనగానే మా అమ్మ అలా అన్నదేం అత్తయ్యా! దాని తల్లే మీ నాన్న కనబడకుండా మాయం కావటానికి కారణం సుధా! చారునెలా పెళ్లాడుతావు? నేను నీకు మంచి సంబంధం పెద్ద కట్నం. పిల్ల బియస్సీ పాసై, టైప్ నేరుస్తున్నది. లాంఛనాలు యిస్తామన్నారు. చారు మగవాళ్లతో స్వేచ్ఛగా తిరుగుతున్నది. వాళ్లమ్మ తిరగనిస్తున్నది. అన్నదత్తయ్యా. నువ్వెలా కారణమైనావు? యేం చేశావు. నా క్లాస్‌మేట్సు వాగ్నింగిచ్చారు. ''మీ అమ్మ చూసిన వారి వంశంలో కాన్సరూ పిచ్చీ వున్నయ్యి''.

ఆ మేనత్త మిటకరించి చూస్తున్నది.

అంతరిక్షయానం చేసే వారి బొమ్మలు, విశ్వాంతరాళం.

''నాయనా, కరుణానిధీ! నువ్వా కాంతమ్మ కూతుర్ని వెంటేసుకు తిరుగుతున్నావుగానీ, ఆ కాంతమ్మ అసాధ్యురాలు. డబ్బు మనిషి. డబ్బు లాగటంలో దైవానిక్కూడా వెరవదు. నీ బాగుగోరి చెప్తున్నాను'' అంటున్నాడు. అరవైయ్యేళ్ల మనిషి ''నాకు డబ్బు లేదే? చారు తెలివిగలది. పెద్ద చదువు చదవాలని ఆశిస్తుంటే ఫుల్ ఫీ కన్సెషతన్ తెప్పించాను. మెరిట్ స్కాలర్‌షిప్ తెప్పించి తక్కినవి చారే చూసుకుంటుంది. నేను పార్టీలో చేరి నా వంతు ఆస్తి మీదా యింటి మీదా అధికారం వదిలేశాను. నాకు కర్మకాండలూ, ఆచారాలు, రీతి రివాజులు విగ్రహారాధన, యాత్రలు, మర్యాదలూ నచ్చవు. నా వారి అవసరం గుర్తించి ఆదుకుంటానంతే. వారిని వదిలేయలేను ఆస్తి వదులుకున్నట్టు. ఆమె మీద నిందలలో యెంతవరకు నిజమున్నదో!''

'' ఒకటన్నా నిరూపిస్తే నమ్ముతావేమో'' అని వెంటబెట్టుకెళ్లాడా పెద్దమనిషి.

''బైపాస్ సర్జరీకి సిద్ధమై నర్సింగ్‌హోమ్‌లో అడ్మిట్ అయిన సీతాపతి వున్న రూమ్‌కి తీసికెళ్లాడు. సీతాపతి భార్యా జానకి అప్పుడే యింటికి వెళ్లింది. స్నానంపానం ముగించి వస్తానని చెప్పివెళ్లింది. మిత్రులు కాపలా, తోడూ వున్నారు. కుర్చీలలో వున్నారు. యేదో చెప్తున్నారు.

తెచ్చినవి షెల్ఫులో వుంచి, వూరడింపు మాటలాడు పెద్ద మనిషి. ధైర్య వచనాలు పల్కాడు.

''యెన్నాళ్లైందీ నెప్పి తెలిసీ సీతాపతీ? అసలు నెప్పి యెందుకొచ్చిందీ? సిగరెట్ వల్లనా?'' అనడిగాడు.

ఒక మిత్రుడు లేచి, ''అవన్నీ మాట్లాడద్దు అన్నారు డాక్టరు గారు. అలా వరండాలో కెళ్దాం రండి'' అని వీరిద్దరినీ తీసికెళ్లాడు.

''వాళ్లమ్మా నాన్నా పోయాక అనేక సమస్యలు యెదుర్కోవాల్సి వచ్చింది పిల్లలకి. ఖర్చులకి తట్టుకోలేక భూమి అమ్మి పంచమన్నారు గార్డియాన్ని. అద్దైంది. అందులోని మోసము గ్రహించలేకపోయారు. చిన్న చదువులు పూర్తయి, చాలు లెమ్మని చిన్న జాబ్స్‌లో దూరినా యిబ్బందులు విరగడ కాలేదు పిల్లలకి. ఆడపిల్లల పెళ్లిళ్లు కాగానే వెళ్లిపోయారు. పింతండ్రి వారి యింట్లో నిలువునా సగభాగం తనదనీ కట్టేప్పుడు డబ్బందించననీ కోర్టు కెక్కాడు. గార్డియన్ దావా గెలిపించింది. ఇల్లు పిల్లలకి దక్కింది. కాని యింట్లో కెవరూ అద్దెకి రాకుండా జ్ఞాతులు తల్లివేపు వారు అడ్డుపడుతూ తామే వుంటూ నష్టపెట్టారు పిల్లల్ని. యెలాగో అతి కష్టం మీద అద్దె వచ్చే మార్గం చూసినా వసూలు చేసుకోటం చేతకాలేదు. వుండే వసూలు కాబడేది అద్దె. గెలవలేక నిరాశపడి అమ్మేయమన్నారు పిల్లలు. గార్డియన్ గ్రాండ్‌మా ఆ వ్యవహారమంతా చూసి ఆ పనికానిచ్చి పంచింది పిల్లలకి. మా ఫ్రెండ్ సీతాపతి చేతులో అయిదు వేలు పడినై. అతని కళ్లు పెద్దవైనై. నోరు వెళ్లబెట్టాడు. ''చిన్న యిల్లు యాభై వేలకి అమ్మజూపుతుంటే మట్టసంగా వున్నది. కొళాయున్నది లైట్లున్నాయి. కొందామని ఆశపడి మాటగూడా యిచ్చాను గ్రాండ్‌మా'' అని కుప్పకూలాడు సీతాపతి.

''డబ్బు. డబ్బు కావాలని తరచూ వేధిస్తే అప్పుతెచ్చి అందించాను'' అన్నది గ్రాండ్‌మా.

''అప్పా!'' సీతాపతి కళ్లు తడి అయినై. అయోమయంగా చూస్తూ ''అలాగే

అన్నా! గ్రాండ్‌మా అంత అప్పు చేయలేదే నేను'' అన్నాడు. నోరు తడారిపోయి బిక్క చచ్చినట్టు చూచాడు.

''వడ్డీ పెరిగింది యిచ్చిన అప్పు మీద'' అన్నది కటువుగా.

''వడ్డీ గూడా కట్టావూ!'' నీరసిస్తున్నాడు.

''నే కట్టలేదు. ఇచ్చింది నా డబ్బు గాదు. నా దగ్గరెక్కడిదీ యివ్వటానికీ'' గ్రాండ్‌మా చేతులూ, పెదవులూ, మూతీ ముసుగు గుండూ అన్నీ కదుల్తూనే వున్నాయి.

మేము సమయానికొచ్చి ఆదుకుని తీసికెళ్లాము సీతాపతిని. భార్యా ఓదార్చి ధైర్యం చెప్పింది. మేము సాయపడ్డాము. మెల్లిగా కాలు కూడదీసుకుని సంపాయించి, భార్యా తన కాసిని నగలు అమ్మమంటే అమ్మి చిన్న డాబా లేవదీసి, పెద్ద భాగం అద్దెకిచ్చి, చిన్న భాగం మూడు గదులలో కుటుంబంతో స్థిరపడి అప్పులేకుండా జాగ్రత్తపడుతూ, భార్యా కోచింగ్ సెంటర్లో చిన్న జాబ్ చేస్తానంటే సరేనన్నాడు. వారి పచ్చ చూడలేకపోయిందా, నష్టపెట్టినా, ముష్టెత్తుకోటం లేదే అనుకున్నదా అన్నట్టు గ్రాండ్‌మా వచ్చి '' ఆ పెద్ద భాగంలో వారిని తరిమేయ్ మేముంటాము. అద్దె యెక్కువిస్తాము. విజయవాడలో యిళ్లు దొరకటం లేదు. నేను ఆశ్రమం నడుపుతున్నాను. ఆ పాక ఖాళీ చేయమనీ యిల్లు కట్టుకోవాలనీ పాక యజమాని వెళ్లగొట్టాడు'' అని వ్యవహారం యెత్తింది గ్రాండ్‌మా రాతకోతలకి పరికరాలు తెచ్చింది.

''నీ మీద కేసు ఫైల్ చేస్తా గ్రాండ్ మా! వెంటబడి యిక్కడ సంతకం పెట్టు, యిక్కడ సంతకం పెట్టూ అని కూడా కూడా తిరుగుతూ వంచించావు. డబ్బు కొట్టేసే విషయంలో ఖర్చు చేయించే విషయానికొస్తేనూ దైవానిక్కడా వెరవవు. హుండీలోవీ లాగేయగల సమర్థత వున్నది నీకు. సాక్ష్యంతో సహా కోర్టులో ఋజువు చేస్తా'' అంటున్నాడు. మేమక్కడే వున్నాం గనక గుండెమీద చెయ్యి వేసుకుని పడిపోతున్న మా మిత్రుని పట్టుకున్నాము.

''లాయరుని సంప్రదించనిదీ నువ్వు నన్నేమీ చేయలేవు మనమడా. వాడికిచ్చేది నాకే యిస్తే సరిపోలా'' అంటూ కొరకొరా చూసి బుర్రకాయ వంచి పెదిమలు కదిలిస్తూ ముక్కు పీక్కుంటూ వెళ్లిపోయింది గ్రాండ్‌మా అని సీతాపతి ఫ్రెండు జేబులో చిన్న సైజు ఫొటో లతికించిన పొడుగాటి మందపాటి కాగితం వేలాడదీసి చూపాడు. పెద్ద మనిషీ, అతని వెంట వచ్చిన గురునాథం గ్రాండ్‌మాని గుర్తుపట్టారు అంత చిన్న ఫొటోల్లో.

సమాధి వదల్లేము. కళ్లు తెరుపుడు పడలేదు చారుమతికి. బొమ్మలు పరుగెత్తినై.

''నాకు వృద్ధాప్యపు పింఛనీయిస్తానని మాటిచ్చావు. నేను వచ్చి నాలుగేళ్లయింది. అంతా లెక్క చూసి చేతబెడితే వెళ్లిపోతాను. నీకు మాట వినపడదు. చూపు గూడా మందగించిందేమో. నా డబ్బు నా మొహాన పారేయ్'' అని గుడ్లురిమితే డబ్బు చేతికందింది.

''నీ మేనగోడలు పెళ్లి. పెళ్లికెటూ రావు. పిల్లవంటి మీద బంగారముంచాలి. ఆ గాజులూ గొలుసూ యిచ్చేయ్'' అంటూ చెయ్యిలాగి చూసి మెడమీద గిల్లింది. కూతురు యేడుస్తూ తీసియిచ్చింది తల్లికి. వాటినందుకుని కంటి దగ్గర పెట్టుకు చూసి కాంతమ్మ ''త్తడి ముక్కరా. నేను వస్తున్నానని తెలిసి నకిలీ నగలు పెట్టుకున్నావు. మోసకారి. బీనారి. లోభి'' అని విసురుగా మేడమెట్లు దిగి వెళ్లిపోయింది.

జరజరా పాము పాకుతున్నట్టు, కుబుసం విడిచిన పాములాగా రీలు పరుగెత్తింది.

సబ్ జడ్జీ రామమోహనరావు అక్క అన్నపూర్ణమ్మ తమ్ముడి చెవులో జోరీగలా అరుస్తున్నది.

''నీ భార్యా రత్నావళి యీ యిల్లు మన నాన్న కట్టించినది. ఆయన స్వార్జితం, గురువు వేషంతో వచ్చి చేరి నెత్తి నెక్కి పచాలిస్తున్న కాంతమ్మ పేర

పెట్టబోతున్నది తమ్ముడూ యెవరూ కుదర్చలేని అపస్మారక వ్యాధి తరచూ వచ్చేది కుదిర్చిందిట గురువు. భక్తి మార్గం చూపి వైకుంఠం కరతలామలకం అని చూపిందిట తమ్ముడూ. పన్నెండు తులాల గొలుసు, ఇరవై తులాల గాజులు, రవ్వల కమ్మలూ యిచ్చేసింది రత్నా. నువ్వు పార్టీకోసం ఖర్చు చేస్తున్నావని తెలిసి నాన్న కోడలి పేర పెట్టిపోయాడు యిల్లు. ఇలాటి గురు ఒకటి యీ యింట్లో చేరి యిల్లు గుల్ల చేస్తుందని నాన్న వూహించలేకపోయాడు'' అని రొదపెట్టింది. రామమోహన్ దాయాది తమ్ముడూ, మరదలూ, పిల్లలూ వచ్చారు వారి నలుగురు కొడుకులలో రంగనాథ్ మొదటివాడు. యెరుపు పదకొండో యేడు చలాకీ. చురుకైన అబ్బాయి. స్నేహశీలి. 'పెదనాన్నగారూ. ఇక్కడ బావున్నది. నేను మీ దగ్గరే వుంటా'' అంటూ కూడా కూడా తిరుగుతూ, ఆయన స్నేహితుల్ని పలకరిస్తూ అన్నీ అందిస్తూ, అన్నపూర్ణమ్మనూ వీటేసుకుని, ''అత్తా. ఈ యిల్లు చాలా బావుంది. లోపలివారు హాలులోకి కనపడరు. కారు షెడ్డు పెద్ద గేటు బావున్నాయి'' అంటూ ఆమెకూ సాయపడ్డాడు.

రామమోహన్‌కి బ్రెయిన్ వేవ్ వచ్చింది. పురోహితుడినీ, పెద్దలనూ మిత్రులనూ కన్సల్టుచేసి ''నాకు సంతానం కలగలేదు. రంగనాథ్ యిక్కడే చదువుతానని యేడుస్తున్నాడు. దత్త స్వీకారం ఒడుగు జరపబోతున్నా'' అని అనౌన్స్ చేశాడు. అన్నపూర్ణమ్మ సంతోషించింది. ''దత్త మహోత్సవంలో తమ్ముడికీ మరదలుకీ పట్టుబట్టలు పెట్టింది. మేనల్లుడి ఒడుగు అయి భిక్షకొస్తే ''భవతీ భిక్షాందేహీ'' అనగానే వేలికి రవ్వ వుంగరం తొడిగి భిక్ష అయిదువేల డ్రాఫ్టు జోలెలో వేసింది. ఆ మహోత్సవంలో ఒడుగులో గురువూ పాల్గొన్నది '' ఇలాటిదేదో జరుగుతుందనే క్రితం యేడే వూదరపెట్టినా, పని నెరవేరింది గాదు'' అని గొణుక్కున్నది. పెదిమలు కదిలినై.

అన్నపూర్ణమ్మ నవ్వాపుకుని ''కుక్కాశ గుంట్రాయితో తీరింది'' అనుకున్నది మనస్సులో.

9

క్రమంగా చారుమతి మెదడు మొద్దుబారి, స్మృతి తప్పటం మొదలైంది. గుర్తించీ గుర్తించకా, సరిగా గుర్తు చేసుకోలేకా చూస్తున్నది. చూపు నిలబడింది.

ఇరవై యేళ్ల అమ్మాయి పరుగెత్తి పోతున్నది. వెనక అరుస్తూ దూషిస్తూ నడివయస్కురాలు, విధవరాలు, ముసుగుజారినా లెక్కచేయక పరుగెత్తలేక అరుస్తున్నది.

''నీ పేర పెట్టించుకో. మొత్తంగా తీసుకో అంటే నీ చెవికెక్కలేదు మొద్దా. దేనికి నిన్ను పోనిచ్చినట్టు. రెంటికిం చెడిన రేవడవైతివి. వాడి కాస్తిపాస్తులూ లేవు. ఆయుధాలందిస్తున్నాడని పైకి పాక్కింది. నిన్ను నట్టేట్లో ముంచి పరారీ అయినాడు. తెలివి తక్కువా ఆకలెక్కువా తండ్రి పోలిక. నిన్ను గన్నవాడినీ నేనే పోషించా. చవట. డబ్బులేనివాడు డబ్బుకి కొరగాడంటే విన్నాడా. ఆర్థికంగా బాగున్న వారినే సంఘం గౌరవిస్తుంది.

ఆనాడు పౌర్ణమి. సముద్రానికి పోటు వచ్చింది. ఉవ్వెత్తున లేచిపడే అలలు. చంద్రుడు నవ్వుతూ పైకి వచ్చాడు. జాలరులు డింగీలలో సముద్రం మీదున్నారు. కొంతమంది ఒడ్డునే నిలబడి వలలు విసురుతున్నారు.

''పకడో. పకడో. లడకీ కీ దిమాగ్ ఖరాబ్ హోగయా దరియాకీ ఓర్ దౌడ్‌తీ హై. పకడో పకడో'' అని ఒక ముస్లిమ్ యువకుడు రొప్పుతూ పరుగెత్తుకొస్తున్నాడు.

నడివయస్కురాలు యిసకలో అడుగులు తీసివేయలేక పోతున్నది. ఆయాసం. ఓపికాలేదు. పడిపోయింది.

యువతిని పెద్ద అల చేతులు చాచిన తండ్రిలాగా వచ్చి లాక్కుపోయింది. డింగీలోని బెస్తలు దూకేశారు. గాలిస్తున్నారు. ఆరుగురు బెస్తలు మునుగుతూ తేలుతున్నారు.

10

ఆశ్రమ అంతర్భాగంలో వెదురు మంచం మీద పచ్చిగడ్డి పరిచి దానిమీద తివాసీ పరిచి, చిరిచాప వేసి, దాని మీదుంచారు చారుమతిని. పెద్ద జాజికాయ పెట్టెలో మంచుగడ్డలు రంపపు పొట్టు వూకచే కప్పబడి చల్లదనాన్ని వదులుతున్నాయి.

ఆనంద ఒక కుర్చీలో శాంతంగా, నువ్వు మొహంతో చూస్తూ కూచుని వున్నాడు చారుమతికి సమాధి వదలాలి. తెలివి రావాలి. గుర్తు రావాలి. నలుగురు శిష్యులు నిలబడి చూస్తున్నారు. కొంత ఆదుర్దా కొంత వింతా కలిగాయి వారికి.

''ప్రమాదం లేదు. నిజమైన సమాధిలోకి వెళ్లింది చారుమతి. అంతర్ముఖురాలైంది. తేరుకుని మనలోకంలోకి వస్తుంది. విశ్రాంతి కావాలి. మెదడుకీ వంటికీ గూడా. ఇవాళ ధారక మేమిచ్చారూ?'' అనడిగాడు.

''లిక్విడ్ డయటే గురూ! ఇవాళే కొంచెం తల కదుల్తుంటే చూసి, ఐస్ క్రీమ్ ముక్కలు గొంతులో పెట్టాము. లోపలికి జారిపోయినై. సెలవుల వెంటకారలేదు'' అన్నది వినీత ఆశ్రమవాసి. మానసేలే ఆమె పట్టిన యోగం. వెంకులు అనే పేరు వినీత అని మార్చుకున్నది. వివేకానందుని శిష్యురాలు సిస్టర్ నివేదిత ఆమెకు ఆదర్శం.

తొమ్మిదైంది. చారుమతి కళ్లు విప్పింది. అన్నివైపులా చూసింది. వినీత ఆమెను లేవదీసి వెనక ఆనుకుని కూచుని జుట్టు దిద్దింది. ఒక శిష్యుడు చారుమతినే చూస్తూ నిలబడి వున్నాడు.

''నాల్రోజులైంది చారూ! కోమాలోకెళ్లావేమోనని ఆదుర్దా కలిగింది. గురువుగారు భయం లేదన్నారు. అంతా గుర్తు వచ్చామా. సహ్యాయులను చూచావు'' అన్నాడా యువకుడు. అతని పేరు రజని.

చారుమతి సరిగా కూచుని గురువుకి దణ్ణంపెట్టింది.

''చారుమతీ! తెలుసుకోరాదనే దైవ నిర్ణయమేమోనన్నాను. గుర్తు వచ్చిందా.

అదంతా దైవలీల అని గ్రహించగానే డిటాచ్‌మెంట్ వచ్చినట్టే. అర్జునుడు'' అపరాధిని అన్నను చంపాను'' అని వ్యధ జెందితే పరమాత్మ ఓదారుస్తూ అవూయకుడా! అదంతా ముందే నిర్ణయమైంది. కర్ణుని నీ ఒక్కడివే చంపాననుకోటం భ్రమ. ''నీ చేతను నా చేతను వరమడిగిన కుంతి చేత వాసవుచేతన్. అదంతా నా లీల'' అని తన భక్తుని వ్యధ తుడిచేశాడు.

నీ తో కూడా వస్తూ తానూ నేరుస్తున్న నీ ఫ్రెండ్ విజయ నిన్నటినించీ కనపడటం లేదు. రావటం లేదు. వెతికి పట్టాలేమో. యోగదృష్టితో యేమి తెలుసుకున్నదో. వివశ అయిందేమో. వుద్రేకంలో యెటుపోయిందో, యేమి చేస్తుందో, కోపమొచ్చిందేమో. తన కోపమే తన శత్రువు. హిరణ్యకశిపుడు తన కోపానికి తను గురైనాడు. దానవేంద్రుడే కంట్రోల్ చేసుకో లేకపోతే'' అని నవ్వుతున్నాడు గురువు.

వినీత లేచి వెళ్లి చల్లని తీయని కొబ్బరి నీరు గాజు గ్లాసుతో తెచ్చి మెల్లిమెల్లిగా చారుమతి చేత తాగించింది.

''గురూ! మీరు చెప్పినట్టు నడుచుకుంటాను. తగ్గిపోయింది. లేవగలను. వినీతను తీసికెళ్తానా అపార్ట్‌మెంట్‌కి రెండ్రోజులుంచుకుని తెచ్చేస్తా'' అని దిగి నిలబడింది.

## 11

జ్ఞానానంద, లీలా దర్శనం అనే పుస్తకం, షెల్ఫు నుంచి తీసి తెచ్చి, కుషన్ కుర్చీలో స్థిరపడి, పుస్తకం విప్పగా కాగితమొకటి కిందబడింది తీసి చదివారు.

''నేను వచ్చిన మొదటిరోజున ''రెండైనా నిందలు చెప్పమ్మా, యెందుకు నీకు నమ్మశక్యం కాలేదో నా వూహకందచ్చు'' అని మీరు అడిగినప్పుడు చెప్పలేకపోయాను. అవమానమనిపించింది. ''పోనీ వ్రాసి యివ్వు'' అన్నారు. ఆ పనీ చేయలేక పోయినా. అవి మరీ గుండెకు గుచ్చుకున్నాయి. ఇపుడు వ్రాసి వుంచగలుగుతున్నాను. మొదటిది ఆ మాతృశ్రీ మనమరాల్ని బాగా నొప్పించింది.

'' ఆస్తి నా పేర పెట్టు వసూ. చాలా లావై పోయి అచ్చు పూతనలాగా వున్నావు. డాక్టరుకి చూపిన రోజున వాడు ''వాసవిది వీక్ హార్ట్. తూకం తగ్గాలి. భద్రతలు తీసుకోండి'' అన్నాడు. సడెన్‌గా గుండెపోటు వచ్చి దివికేగుతావేమో వసూ! స్త్రీలకు హక్కులు లా ప్రకారం వచ్చాయి. అమ్మేసుకునే హక్కు వచ్చింది లేదా, యెవరి పేరైనా పెట్టేసే హక్కు వచ్చింది. నీవు మతిభ్రష్టవని డాక్టరుచే సర్టిఫై చేయించి, నిన్ను కట్టుకున్న చవటాయి నిన్నొదిలేస్తే నీకు లా ప్రకారం రావాల్సిన భృతి తెప్పించింది నేనే. నిన్ను కనిబెట్టివున్నది నేనే. రెండెకరాల మాగానీ, డాబా నా నాకే చెందాలి. లాయర్నీ, సాక్షుల్నీ తెచ్చా. ఇవాళే ఆ పని పూర్తి చేసిపో'' అన్నదిట. పరిత్యక్త, విచలిత మనస్కురాలు వాసవిని. రెండోది గురూ యెటువంటి విషయం వ్రాయాల్సిన వచ్చింది గురూ! నా నేరమేమిటో ఫోర్జరీ చేసి ఆస్తి దఖలు పరచుకోటానికి గుండె ధైర్యం చూపిందిగాని దైవానికి వెరవలేదు. గొంతు బిగించినట్లై, యోగ దృష్టి చెరిగిపోతే బాగుండు. మాయా ప్రపంచంలో పడితే బాగుండు అనిపించింది. మొదటే మీ మాటలు సరిగా అర్ధం చేసుకున్నట్లయితే బాగుండిపోయేది అనిపించింది చారుమతి''.

అడుగుల చప్పుడు వినరాగా, ఆనంత తలెత్తి చూసి చదివిన కాగితాన్ని మడిచి పుస్తకంలో దాచారు. పుస్తకం షెల్ఫులో సర్ది, శ్రీకలా అనే మరో పుస్తకం తీసి తెచ్చుకుని సోఫాలో కూచున్నారు. యెదురు చూస్తున్నారు.

తెలివిరాని విజయను నలుగురు శిష్యులు, యిద్దరమ్మాయిలూ యిద్దరబ్బాయిలూ, భద్రంగా పట్టుకొని నేల మీదుంచారు. గాలి పంకా స్టాండుకున్నదాన్ని ఆన్ చేశారు.

''నమస్తే గురూ! మీరు చెప్పినట్లు నాల్గువేపులా వెతుకుతూ వెళ్లాం. దైవమనుకూలించగా విజయను పట్టేశాం. విమానాశ్రయం వేపు లేడిలాగా పరుగెత్తుకెళ్తున్నది. ఆ పరుగు చూస్తే మతి సరిగా పని చేయటం లేదనిపించింది. మోటర్‌సైకిళ్లమీద వెళ్లాంగనక అడ్డం వెళ్లి పట్టుకోగలిగాం. బూడిదరంగు పాంటూ, మాసిన షర్టు అదే రంగుది, మొహం కనపడకుండా టోపీ, నల్ల

కళ్లజోడు, విరియబోసిన జుట్టు, బాగా టైర్డై వుండి వుండాలి గురూ, ఆయాసపడుతూ మా చేతుల్లోకి ఒరిగిపోయింది విజయ. నమ్మరేమో గురూ, చిన్న సైజు మారణాయుధాలు జేబుల్లో కర్ఛీఫ్‌తో చుట్టి దాచింది. నైలాన్ తాడు చిన్నది. దగ్గర్లోవున్న హోటల్‌కి తీసికెళ్లి రూమ్ మాట్లాడి, అందులో బెడ్ మీదుంచి ప్రథమ చికిత్స చేశాం. తిండిగూడా లేదేమో అంతవరకూ. ఐస్‌క్రీమ్ గొంతులో పోస్తూ తడిబట్టతో తుడిచాను. కాళ్లూ చేతులూ చల్లబడుతున్నాయని గమనించి, వైన్ సీసా చిన్నది కొనితెచ్చి మెల్లిగా గొంతులో పోస్తూ అర ఔన్సు మింగిచ్చేప్పటికే మొహానికి రంగు వచ్చి వంటికి వేడి వచ్చింది. కళ్లు విప్పి చూసింది గానీ గురూ విజయ మమ్మల్ని గుర్తించలేదు. ''యెక్కడున్నాను'' అని అడుగుతుందని ఆశిస్తే నిరాశే మిగిలింది గురూ. టాక్సీ అందలేదు. భద్రంగా బుజాల మీదుంచుకుని మోటార్ సైకిల్‌మీదే తేగలిగాం గురూ. తెలివిరావాలిగా'' అని చేతులు కట్టుకు నిలబడ్డాడు. విచారంగా ఆదుర్దాగా చూస్తున్నారు.

''భయం లేదు. ఆదుర్దా పడకండి. వినీత చూస్తుంది. ఎక్సైటై పోయింది విజయ. ఉన్మాదం లొంగదీసి వుండాలి. ఆ గదిలో వెదురు పక్క మీదుంచండి. మీరు నలుగురు వెళ్లి మీ సంగతీ, మీ పన్లూ చూసుకోండి. చేయగలిగినది చేసి మానవత చూపారు. సంతోషం. నేనూ వినీతా తగ్గిస్తాం. చారుమతి కనిపిస్తే విజయ. అందింది అని చెప్పాలి. అదీ అడిగితేనే. వివరాలు చెప్పద్దు. అడక్కపోతే అసలే చెప్పద్దు. చారుమతే యిక్కడికి రావచ్చు. యెలా చెప్తే బాగుంటుందో ఆలోచించి నేనంతా వివరిస్తా'' అన్నాడు గురువు.

నమస్తే చెప్పి నలుగురూ విజయను బెడ్ మీదుంచి వెళ్లిపోయారు.

విజయ కోలుకుని తేరుకుని నవ్వుతూ మాట్లాడటానికి నెలపట్టింది. పిచ్చి ఆలోచనలతో మెదడు పాడుగాకుండా వుండగలందులకు గురువు, వినీత శ్రమించారు. శ్రద్ధగా డయట్ విశ్రాంతి, కళ్లు విప్పి మాట్లాడగానే, మంచి చిత్రాలూ, మంచి విషయాలూ, ఆరోగ్యమైన విద్యార్థులూ వుండేట్టు చూశారు. వ్యాయామం, ప్రార్థనా చేయించారు.

విజయ సోఫాలో కూచుని నవ్వుతున్నదిగానీ, మొహం చిట్లించి గుర్తు వచ్చిన దానిని మరిచిపోవాలనే ప్రయత్నం యింకా కొద్దిగా వున్నది. రక్తం గూడు కడుతుంది మొహంలో. మళ్లా తట్టుకుంటుంది. వాళ్లమ్మ మనిషి సాయంతో వచ్చి చూసి వెళ్లింది.

‘‘మీరున్నారు గురూ! నేను యేమి చేసే స్థితిలో లేను. దేవుని పిలుపుకోసం చూస్తున్నా’’ అన్నది.

అది పెద్ద గదే. బాగా గాలీ వెల్తురూ వస్తాయి. కొద్ది మంది శిష్యులూ, విజయను తెచ్చినవారూ, కుర్చీల్లో వున్నారు పాలరాతి నేల చదరంగం లాగా నలుపూ తెలుపూ చదరపు రాళ్లు పరిచి వున్నది గోడలకు, పురాణగాథలు, చారిత్రక గాథలు పెయింట్ చేయబడ్డాయి. సీలింగ్ ఫాన్ తిరుగుతున్నది. మూలగా ఫోన్. మరో మూల బల్లమీద పాక్సు యంత్రం. మరోవేపు దూరదర్శన్.

గుర్తు వస్తే చెప్పుతున్నట్టు విజయ చెప్పుకెళ్లింది. ‘‘ఆ బద్మాష్‌ని, శఠుని’’ అని నవ్వింది విజయ.

‘‘నాయకులు, అనుకూలుడు, శఠుడు, దక్షిణ నాయకుడు ప్రతికూలుడు అని రకాలున్నారు గురూ. మీకు తెలిసే వుండాలి. ఒక శ్రోత నవ్వుతూ అడిగాడు ‘‘నాయికలలో లేరా విజయా?’’ ‘‘వున్నారు లేకేం పద్మిని, హస్తిని, చిత్తిని, శంఖిణి అని కారెక్టర్ చెపితే, శఠి, ఖండిత, అనుకూల, ప్రతికూలవంటివి సైకాలజీ చెప్తాయి. ఇతర భాషలోవీ బాగుంటాయి. నెగెటివ్ హీరో, రోగ్, వంచకుడు, అబద్ధాల కోరు, బద్మాష్, బేవకూఫ్, ఫాక్స్, జాకాల్’’ అని బాగా నవ్వింది. ‘‘బేయీ మాన్, బేవఫా, నమక్‌హరామ్, నమక్ హలాల్ ఆ లిస్టులో వున్న వానిని నా కజిన్ యెందుకు భరిస్తుందో నా వూహకందలేదు గురూ. అదో మోస్తరు పూలేమో నా కజిన్. దద్దమ్మేమో, నోట్లో నాలుక లేదేమో అనుకున్నాను గురూ. నా కజిన్ సుశీకే బాధాలేదేమోగాని వాడిని స్టడీ చేసిన నా ఒళ్లు దహించుకుపోయింది. దాని రక్తం తిరగబడదా అనిపించింది. ఆ హిట్లరైట్ మనిషీ

నా కజిన్ సుశీ మానెండ్ వైఫ్ అయినారు. అయితే మాత్రం అంతగా తగ్గి వుండాలా. వాడంతగా డామినేట్ చేయటం కల్చరా. మాయల ఫకీరు బాలనాగమ్మను కుక్కగా మార్చినట్టు మార్చాడా మగధీరుడు హిట్లరైట్'' అంటున్నది.

''మంత్రదండమున్నదా హిట్లరైట్‌కీ'' అనడిగాడో శిష్యుడు ''అక్కర్లా, మాటలే మంత్రాలు బురిడీ వేస్తాడు మాటలతో అంటూ నవ్వుతున్నది విజయ. ''గడుసు మనిషి'' అన్నది. ''క బురిడీ విందాం విజయా'' అన్నది విశాల శిష్యురాలు. ''నేను మంచివాడిని గనక, నిన్ను నీ పిల్లల్ని తెచ్చి దగ్గర పెట్టుకున్నాను. మరోడైతే యెప్పుడో డిజోన్ చేసేవాడు. నా కోసమెంతమంది తపిస్తున్నారో తెలుసా?'' అంటాడావుల్లూ.

''నీ కజిను చిత్రమైన తపస్సు చేస్తున్నాడేమో అనే ఆలోచనే రాలేదా నీకు విజయా? ఆవేశపడ్డావు'' అన్నాడు ఆనంద ఆ కంఠంలో మార్దవం సానుభూతీ, దయా వినిపించాయి విజయకి. అయినా, ''అదేం తపస్సు గురూ! పనికిరాని తపస్సు. ఆత్మ గౌరవం ఆత్మాభిమానం కోల్పోవటం తపస్సా'' అన్నది.

'' ఆ ఆ. తపస్సే అనాలి విజయా. రావణాసురుడిదో రకం తపస్సు, హిరణ్యకశిపునిదింకో విధం, వాల్మీకి అని ప్రసిద్ధికెక్కిన ప్రాచేతసునిడి మరోవిధమైన తపస్సు. మరా, మరా అని జపిస్తూ పోగా రామ శబ్దం వచ్చిందట. ఆయన చుట్టూ పుట్ట పెరిగిందట. వల్మీకం అంటే పుట్ట. అందుకే వాల్మీకి అనేదే వ్యాప్తిలో కొచ్చి స్థిరపడింది. ప్రాచేతసుడనేది మరుగున పడింది. యంకే గాంధీ అంటే యెవరూ తెలిసినట్టు మాట్లాడరు. మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ కన్న మహాత్మా, బాపూ అనేవే చాలామందికి తెలుసు. నేతాజీ అంటే తెలిసినవారు చాలా మంది వారికి సుభాస్ చంద్రుడెవరో తెలియదు. వారు తపశ్శాలురనే అనాలి విజయా. భస్మాసురుని తపస్సింకా భయంకరమైనది విజయా! ఆ తపశ్శక్తి వల్లే వాడికా పేరొచ్చింది. వాడి అసలు పేరు యెవరికీ తెలియదు''.

''యెలా చేశాడూ తపస్సు గురూ?'' లత అడిగింది.

'పంచాగ్ని మధ్య కూర్చుని చేశాడు. కండలు కోసి హోమగుండంలో వేశాడు. చివరికి తల నరికి గుండంలో పడేశాడు.

''యెవర్ని గురించి చేశాడు?'' వివేక్ అడిగాడు.

''శంకరుని గురించి''

''అంత ఆయాసపడక్కర్లేదే గురూ? శంకరుడు భక్త సులభుడు గదూ?'' విజయ అడిగింది.

ఫరవాలేదు ఆవేశం తగ్గిపోతూ మంచివి గుర్తు వస్తున్నాయి తగ్గుతున్నట్టే'' అనుకున్నాడు గురువు.

''భక్త సులభుడే కావచ్చు విజయా. కాని భక్తుని కోరిక తానివ్వాల్సిన వరం, దాని ఫలితాలు ముందే వూహించాడేమో శంకరుడు ఒంటి కాల మీద నిలబడి, చేతులు పైకెత్తి కలిపి, నిరాహరి అయి, వాయుభక్షణ చేస్తూ కూడా చేసినవారున్నారు. భగీరథుడు పెద్దకాలం మంచుకొండ మీద నిలబడి తపస్సు చేస్తే నిడుదపెన్నెటి వేణి జడలుగట్టె అని కవిగానం చేశాడు''.

''మంచుకొండ మీదెందుకు నిలబడి చేశాడు గురూ?'' శాంతావిక్షశ అడిగింది.

''వియత్ గంగను కిందికి తేవాలి, ఆ గంగా జలంతో తన తాతలు పవిత్రమౌతారు. వారికి కర్మల్లేవంత వరకు''.

''యెందుకని లేవు?'' నూర్జహాన్ బేగం అడిగింది.

''బూడిదయినారు. సంస్కారంతో పనిబడలేదిహా''

''యెందుకు బూడిదైనారు'' బదరుద్దీన్ అడిగాడు

''గోడల మీద చిత్రించబడిన చిత్రాలు చూడలేదు''

''చూశాం, చూస్తున్నాంగాని గురూ. వాటి వెనక గాథలు సరిగా

తెలియవు'' అన్నాడు ముత్యంచెట్టి

''అబ్రహాం తన కొడుకుని చితిపై పెట్టే చిత్రమూ వున్నది గురూ! ఆ కథ మీకు తెలుసా'' అనడిగాడు సామ్యుయేలు.

'సంతానం లేదని దైవాన్ని ప్రార్థిస్తే కొడుకు పుడతాడు వాడిని నాకు బలియివ్వాలి అన్నాడు జెహోవా. అబ్రహం మాట నిలబెట్టుకోటానికి పదేళ్ల **కొడుకుని దూరంగా తీసికెళ్లి కట్టెలు పేర్చి నిప్పు ముట్టించి, కొడుకేమో అడ్డు** చెప్పలేదు, పారిపోలేదు, కొడుకు నెత్తగానే దైవం, ''అబ్రహాం! నీ సత్యసంధతకు సంతోషించాను. కొడుకును చితిపై పెట్టక్కర్లేదు. మాట నిలకడగలవాడిని. ఒక గొర్రెను చంపి వండి అందరికీ విందు చేయి చాలు'' అన్నాడు జెహోవా. అదే పండగ చేసుకుంటారు. అంటే సత్యసంధతను గుర్తు చేసుకుంటారన్నమాట. హరిశ్చంద్రుని కథా అదే, రుక్మాంగద మహారాజు కథా అదే. ఆ చిత్రాలూ వున్నాయి. ''మాకు రుక్మాంగద కథ తెలియదు గురూ చెప్పరూ వింటాము'' పావెల్, జానమ్మ అడిగారు.

''రుక్మాంగదుడు ఏదాదశీవ్రతం హరివ్రతం తన రాజ్యంలో పసిపిల్ల ... అందరూ చేయాలని చాటింపించాడు. ఆనాడు వుపోష్యం చేయాలి. నిట్రుపాసం చేయలేనివారు. 'పచ్చిపాలూ తాగి పల్లారగించీ, యెట్లైన హరివ్రతము ఒనరిపవలెనూ'' అని రాజాజ్ఞ మోహినీ రూపంలో హరి పరీక్షింపదలచి వనంలో ఒంటరిగా వుయ్యాలూగుతూ రాజును లూర్ చేశాడు. రాజా మోహినిని వెంటబెట్టుకెళ్లాడు. తనమాట కెదురు చెప్పరాదనే ఒప్పందం మీద వెల్లింది మోహిని. ఏకాదశి రానే వచ్చింది. ఆ వ్రతం మానేయమన్నది మోహిని. ''మానసుగాక. మానను. మరోటి చెప్పు చేస్తా'' అన్నాడు రుక్మాంగదుడు.

''నీ ఒక్కగానొక్క కొడుకునూ ధర్మాంగదుని నువే నీ చేతితో నీ కత్తితో తలనరకాలి'' అన్నది మోహిని.

''కొడుకు సంతోషంగా ఒప్పుకొని వచ్చాడు'' తండ్రిచేత ఏకాదశినాడు

చంపబడటమంటే అదృష్టం'' అన్నాడా పిల్లాడు. రాజు కత్తి దూసియెత్తేప్పటికి మోహిని వచ్చి రాజు చెయ్యి పట్టుకున్నది. '' ఇప్పుడు మించిపోయింది లేదు రాజా. కొడుకును చంపుకుంటావా? వ్రతం మానేస్తే సరిపోలా?'' అన్నది నవ్వుతూ.

''నా చెయ్యి వదులు మోహినీ!'' అని మోహిని చెయ్యిపట్టుకుని లాగివేయబోగా మోహిని స్థానంలో హరి దర్శనమిచ్చాడు''.

అంతా చప్పట్లు కొట్టి ''బలే. బలే'' అన్నారు.

''భగీరధుని కథ పూర్తిచేయండి గురూ?'' సమతాఘోష్ అడిగింది.

''సగర చక్రవర్తి నూరు యజ్ఞాలు పూర్తి చేస్తూ నూరోదానికి గుఱ్ఱం వదిలితే యింద్రుడు గుఱ్ఱాన్నెత్తుకు పోయి దాచాడు. గుఱ్ఱం కనపడక సగరపుత్రులు వెతికి వెతికి తవ్వి తవ్విపోతూ కపిలుడనే ముని తపస్సు చేసుకునే చోటికి చేరి కపిలుని చూసి ''వీడే గుఱ్ఱాన్నెత్తు కొచ్చిన దొంగ ఇక్కడే యెక్కడో దాచి దొంగ తపస్సు చేస్తున్నాడని కపిలుని మీదికి పోయినారు. ఆయన కళ్లు తెరిచి చూడగానే మంటలు వచ్చి వారిని బూడిద చేశాయి. సగరుని మనమడు భగీరధుడు. తాత దుఃఖమూ చూశాడు. నూరో యజ్ఞమూ పూర్తికాలేదు. పురోహితుడిని అడిగితే , ''యేం చేయాలి. నా తాత తండ్రులకి కర్మలు లేవు. వారిని పవిత్రులనుగా చేయటం యెట్లా''.

''భగీరధా! వియద్గంగను భూమికి తెస్తే ఆ గంగా జలాలతో తడిసి ఆ బూడిద గంగలో కలిస్తే అంతా పవిత్రమౌతారు'' అని చెప్పారు.

గొప్ప తపస్సు చేస్తే వియద్గంగ అన్నది ''భగీరధా! నిన్ను మెచ్చాను. కాని నేను వేగంగా బలంగా వస్తే నన్ను పట్టేవారుండాలి. ఆ పని శివుడొక్కడే చేయగలడు. నీవా శివుని సంతోషపెట్టు వస్తాను'' అన్నది.

శివుడు వెండికొండ మీదుంటాడు. వెండికొండంటే హిమాలయా మంచుకొండ. అందుకని మంచుమీద నిలబడి భగీరధుడు తపస్సు చేశాడు.

''శివుడు గంగను పట్టాడా గురూ?'' ఇబ్రహీమ్‌షా అడిగాడు.

''పట్టాడుగా ఆ చిత్రమూ వున్నదే''.

''అంతా పవిత్రమైనారా?'' అన్నది మేరీవుడ్

ఆ. ఆ. అయినారు. భగీరథుడు పెద్ద ప్రయత్నానికి పేరుబడ్డాడు. భగీరథ ప్రయత్నమని పేరు దానికి. గంగను ప్రార్థించగా ఆమె శివుని నెత్తిన దిగితే, శివుడు జటాజూటంలో పట్టేశాడు. అసలు శివుని వేడటానికే మంచు మీద నిలబడి తపస్సు చేసిన భగీరథుడు, గంగను వదలమని మళ్లా తపస్సు. ఆయన జడ ఒకటి వదులు చేసి వదిల్తే ''నువ్వు ముందు రథం మీద పోతూ వుండు నేను నిన్ననుసరిస్తాను అన్నాది గంగ. ఒడ్డునబడ్డాననుకుంటే జలజలమనే ధ్వని ఆగిపోతే రథం ఆపి వెనక్కొచ్చి చూస్తే జాహ్ను అనే ముని పట్టేశాడు గంగను. మళ్లా వేడుకుంటే చెవిలోంచి వదలాడా ముని. జాహ్నవి. అలా చివరపేరు శతధృవ. మొత్తానికి సగరులు తవ్విన చోటికొచ్చింది. బూడిదంతా తడిపింది. సగరులు కవ్వారు గనక సాగరము. భగీరథుడు తెచ్చాడు గనక భాగీరథి అనే పేరొచ్చింది గంగకు. కవులు గానం చేస్తే విని చిత్రకారులు చిత్రించారు. ''అసురుని కథ పూర్తిచేయరు గురూ'' అనడిగింది మాలతి తక్కినవాళ్లు సెకండ్ చేశారు.

''అది ట్రాజెడీ అయింది. అదెందుకు?''

''ఫరవాలేదు గురూ చెప్పండి'' అని వేడుకున్నారు.

''శంకరుడుండగానే భస్మాసురుడు తానెవరి నెత్తిన చేయి పెడతాడో వారక్కడికక్కడే భస్మం కావాలన్నాడు. శంకరుడిచ్చేశాడు. ఆ వరంలోని డ్రాబాక్ తెలియదసురునికి. సంతోషంగా యింటికెళ్లాడు. కొడుకెదురుగా వస్తే ముద్దు చేసి కూచోబెట్టుకుని తలనిమిరాడు. కొడుకు భస్మమైనాడు. అసురుడు పరుగెత్తుకెళ్లి '' ఆ వరం బాగాలేదు తీసేయ్'' అంటే శివుడు ''నాకు చేతగాదు'' అన్నాడు. ''అందులోని డ్రాబాక్ యెందుకు చెప్పకుండా యిచ్చావు. నీ నెత్తినే పెడతా'' అని వెంటబడితే శివుడు పరుగెత్తాడు. హరి మోహినీ అవతారమెత్తి

అసురుని కెదురుగా వచ్చి, డాన్సు చేతాం రమ్మని ఆడించి తనను అనుకరించేట్టు చేసి తన నెత్తిన తన చేయి పెట్టుకుంటే అదేదో భంగిమ అనుకుని అసురుడు అలాగే తన చేయి తననెత్తిన పెట్టుకుని భస్మమైనాడు.

ఈ రాకెట్ యుగంలోనూ, తపస్సునందు నమ్మికగలవారున్నారు విజయా. దేవాదాయం చుక్కలనంటిందంటే, అది నమ్మకమనే అనాలి. దైవ సంబంధమైన సాహిత్యాన్ని పారితోషికమిచ్చి, ప్రోత్సహిస్తున్నారాదాయంతో. కళాశాలలు, సత్రాలు, మఠాలు, విద్యుత్ సభలు, పండిత సన్మానాలు అంతేనా విజయా, గోవధ జరుగుతోందని విని, పీఠాధిపతి ''చంపకండి మేము కొంటాము. క్రాస్ బ్రీడింగ్ చేయించవచ్చు'' అని ఆపారు గోవధను.

''అసలు వధ యెందుకు మొదలైంది గురూ ''జర్మనీ వారు పాలు యెక్కువగా వుత్పత్తి అవుతుంటే పాల ధర పడిపోయి జర్మనీకి ఆర్థికంగా యిక్కట్టులొస్తాయని ఆవులను ఫినిష్ చేతాము అన్నారు. మన పీఠాధిపతి కొన్నారు.

''శివుడక్కడే యెందుకున్నాడు గురూ!'' షీలా జాన్సన్ అడిగింది.

''వాడి తెలివితేటలూ స్వార్థమూ, ఆలోచనలేని కోరికలూ వాడికే తెలిసిరావాలని అక్కడే వున్నాడు శివుడు.

''కథలు బాగున్నాయిగాని గురూ, తపస్సు ఫలిస్తుందని నమ్మబలుకుతున్నారు గురూ'' అన్నది విజయ.

''అందులో ధోఖాలేదు విజయా?

''కోరిక యెట్టిదైనానా?''

'' ఆ. ఆర్థోజిజ్ఞా అర్థార్థీ'' అన్నాడు పరమాత్మ.

''మా బంధువొకామె, తొంభై నూరు మధ్య వయసులో దివంగతురాలే సమయానికి, ఆమె యినప్పెట్టెలో రొక్కం యాభైవేలూ, లక్ష రూపాయల విలువ చేసే మట్టసమైన డాబా, దానికి చుట్టూ మొక్కలు, కొబ్బరి చెట్లూ, నిమ్మ చెట్లూ

గలిగిన స్థలం, రెండెకరాల మాగానీ వున్నాయి. మాగాని మీద ఐవేజు వస్తుంది జనవరిలో కుప్పలు కొట్టి ధాన్యం అమ్మవేసి రొక్కమిస్తారు. కౌలుకి తీసుకున్న రైతన్నలు. శుక్లాలేర్పడి ముదిరి కబోది అయినా మెదడు పదునుగానే వున్నది. మొక్కవోని తెలివీ అలాగే వున్నది. ఆస్తి అంతా పదిలక్షలకమ్మి లక్షాధికారి కావాలని పథకం వేస్తూనే మెతక మనుషులు. తెలివి తక్కువ వారినీ పట్టాలని ఆలోచన చేస్తున్నది బందుగురాలు. జరయుమృతియు లేని జననట్టు ధనమూ గూర్పవలయు అని పద్యం అల్లింది''.

విజయ బాగా నవ్వింది ''నైజామ్‌లాగా నన్నమాట గురూ!''

''తెలివిపైకి తేలుతున్నది'' అని చూసి ఆనంద ''లేడిలాగా పరుగెత్తటమెందుకు విజయా. విమానాశ్రయంలో యెవరినైనా కలుసుకోవాలా. వారు వెళ్లిపోతున్నారా? తిరిగిరారా?'' అన్నాడు నిదానంగా.

''మీట్ కావటానిక్కాదు గురూ షూట్ చేయుటానికి. ఎయిర్‌షిప్‌లో కెక్కేందుకు నిచ్చెన వేస్తారు. ఆ మెట్ల మీదే కూనీ చేస్తే లోపలికెక్క ఛాన్సుండదు'' అన్నది కర్కశంగా.

''అది మర్డర్ విజయా. అసాధ్యం గూడాను. బయటే అరెస్టౌతానే. చాలా భద్రతలూ, చెకింగ్ వుంటాయేం. హింస సత్ఫలితాన్నివ్వదే. అహింసా పరమోధర్మః''

''నోరెత్తకుండా చేయటమూ, బొటన వేలు కింద నొక్కి వుంచటమూ, మితిలేని దాష్టీకం గూడా హింసే గురూ. తపస్సు అనేకరకాలని చమత్కరించారు మీరు. హింసగూడా అంతే. నా కజిన్ని హింసించాడు. దాని నెగెటివ్ హీరో. యూరప్ పర్యటనకీ, జర్మనీలో హోమియో కాన్ఫరెన్సుకీ ఆహ్వానింపబడి వెళ్తున్నాడా దగుల్బాజీ. హేండ్‌సమ్ అండ్ బ్యూటిఫుల్ ఫర్సనాలిటీస్‌నీ, చిత్ర విచిత్రమైన ట్రిక్స్ చేసేవారినీ ప్రభుత్వం సాంస్కృతిక వుత్సవాలలో పాల్గొనమని పంపుతున్నారట. పూర్వాశ్రమంలో ఆ బద్మాష్ మోడెల్ మరియు స్టేజ్ యాక్టర్. హోమియో ప్రాక్టీస్ చేస్తున్నాడిప్పుడు.

''ప్రాక్టీసెట్లావున్నదీ?''

''హి బ్రోక్ మెనీ హార్ట్స్. రేర్ బ్రెయిన్స్ ఆర్ ఎఫెక్టెడ్. వికలురైనారు. బ్లీడ్ చేశాడు జలగలాగా. కానిరాని పట్టుబడని దొంగ. దొరికితే దొంగా, దొరక్కపోతే దొరా అంటున్నది తలవంచుకుని.

శిష్యుడు లేచి అన్నాడు ''విజయను మేము పట్టగలగటం లక్కే గురూ. ఆమె టార్జెట్ వెయిటింగ్ లిస్టులో చేర్చబడ్డాడు. అందుకని రాలేదు. నెక్స్ట ఫ్లైట్ లో వెళ్లేవారి లిస్టులో వున్నవారితో నెక్స్ట ఫ్లైట్ లో వెళ్తాడు. అన్నీ కనుగొనగలిగాము. దీనానాథ్ గళ్ ఫ్రెండ్ ఎయిర్ పోర్టులో జాబ్. పేరు తెలియదు. కాని గురూ కొలతలు ట్వంటీఫోర్, థర్టీ ఫోర్, ట్వంటీ సిక్స్. దీనానాథ్ అంటే ప్రాణం. ఆ అభిమానం వల్లే చెప్పింది. ''తప్పించుకుపోయెరా, తాబేటి బుర్రా''

విజయ నవ్వింది.

''పోతా గురూ పని వున్నాది'' అన్నాడా శిష్యుడు.

గురువు తలూపాడు.

విజయ వంక చూసి గురువడిగాడు.

''నెగటివ్ హీరోలాగా వున్నాడే అని గుర్తించలేదు నీ కజిన్? పిన్నవయసా?''

''పిన్న గాదు. అలా అని ప్రౌఢా గాదు గురూ నా కజిన్ తన కళ్లనూ, చెవులనూ నమ్మింది'' అంతోనే సంతోషంతో చేతులు కలిపి నవ్వుతూ విజయ అన్నది. నేను యోగదృష్టిని వీడియోఫిల్మ్ లాగా మార్చి చూపగలగటం, పరిశోధన చేసి, పర్ఫెక్ట్ చేశాను గురూ. చెప్పేదా? చూస్తారా గురూ'' అన్నది కళ్లు మెరిశాయి. ''గ్లిమ్సెస్‌లాగా చూపిస్తా'' అన్నది. యీ మాట నవ్వితే, ముత్యాలలాగా మెరిసే వరుసైన పలువరుస కనబడింది.

'' ఓకే. విజయా! నీవు స్పెషల్ శిష్యురాలివి'' అని ప్రోత్సహించాడు గురువు.

విజయ దూరదర్శన్ వంక చూసి, మెషీన్ సాయంతో ఆన్ చేసింది. కూచున్నచోటనించి లేవనే లేదు.

అందరి కళ్లా వుత్సుకతను వెల్లడిస్తూకడితే బొమ్మలను చూస్తూ నవమన్మథుడిలాగా వుండి, పూర్ణచంద్రునిలాగా నవ్వుతూ, 'పెళ్లెందుకాడలేదు. సుశీలా! చదివి యేమి చేయాలని?'' అంటున్నాడు.

''వంట చేయలేను సాబ్! నాలుగో యేటినించే అది నాతో నేస్తం కట్టింది. మనిషి వంక మహాలక్ష్మి తీరుస్తుందట. నేను మహాలక్ష్మి ముద్దులపట్టిని గాను గనక బ్యూటీ అని రక్తారు. తప్పులెన్నుతారు. ''అమ్మకు రెండబ్బకు రెండమ్మహిలో'' అన్నాడు కవి అదే జరుగుతుంది పెళ్లంటూ వెలిగిస్తే. ఇంకా వెూటు సావెుతలున్నాయి సాబ్'' అని తలవంచుకున్నది. ''తలవంచుకోటమెందుకు సుశీ. ఇవి చిల్ల చూపులుగావే. గెట్టుగెదర్ లాంటిది. యేమిటా మోటు సామెత. నాకవంటే చాలా యిష్టం. అసలు కూలి జనం కోపం రాగానే తిట్టుకునే తిట్లు యెంతో ఆనందిస్తాయి. వాళ్ల భాష కెంత స్వేచ్ఛ. వాళ్ల కవి తప్పుగా తోచవు. మళ్లా ఫ్రెండ్లీగానే వుంటారు. మొగుడూ పెళ్లామైనా యెన్ని అనుకున్నా, యెడమొహం పెడమొహంగా గడుపరు రాత్రికి. మళ్లా ఆలుమగలే గూటిలో'' అని నవ్వుతున్నాడు.

''మీ స్టైల్ నేనంతగా మెచ్చను సాబ్. మాట మిగలరాదనేదే నా స్టైల్. సామెతా'' అని నవ్వింది సుశీ. ''అప్పుడే తన పేరు చిన్నది చేశాడే. డేంజర్ సిగ్నల్ అది'' అనుకున్నది సుశీల కాని ''కలవారి బిడ్డ గాడిదతో పోయినా తప్పుపట్టరుట, పేదవారి బిడ్డ పెనిమిటితో పోయినా. తప్పు పడుతుందిట లోకం. అదే దాని తీరు. పిల్లేమిటి సాబ్. పెద్ద చూపులనే అనండి సాబ్. నా యేళ్లు గుర్తు చేస్తూ గేలి చేస్తూనే వున్నారు అయినవారూ కానివారూ. ఇండిపెండెంట్‌గా లైఫ లీడ్ చేయాలని కోరిక. యేలటానికి కోటలు లేకపోవచ్చు. కాని బుల్లి బుల్లి జాబ్స్ చాలా వున్నాయి గదండీ. అందులో ఒకటి ఆక్రమించాలని. అంతే. దురాశలేదు సాబ్ దురాశ దుఃఖం చేటు'' అన్నది సుశీ.

''బుల్లి జాబ్, అవమానాలు, యిక్కట్లు తెస్తుంది నీకు తెలియదేమో సుశీ!'' అని ఆశ రేపాడు మాన్.

''మగడూ ఆ రెండూ సప్లై చేస్తాడు సాబ్. నాకు గడుస్తనమూ రాదు. రాగతనమూ లేదు''.

''నేను చదివిస్తే చదువుతావా?'' ఆశ అనే పాశాన్ని యింకా పొడిగించాడు మాన్.

''మీరెందుకు చదివించాలి సాబ్. నా చదువు ముగియ వచ్చేసింది''

''యెందుకంటే, తర్వాత లైఫ్‌లో ఒకరికొకరు చేదోడు వాదోడుగా వుండాలని'' అన్నాడింకా ఆశరేపుతూ.

'పెద్ద చదువంటే అల్లా టప్పా గోంగూరేమీ కాదే'' అన్నది ఆలోచనలో పడింది సుశీ.

విజయ కామెంటరీ వినిపించింది అక్కడున్నవారికి.

''అలా అన్నదిగానీ నా కజిన్ గురూ! దాని కళ్లూ చెవులూ అప్పుడే దాన్ని మోసగించ మొదలు పెట్టాయి. వయసుకాడూ, తేనె మాటలు ఆశతో కట్టిపడేసే పథకం గ్రహింపుకు రాలేదు సుశీకి.

ఫిల్మ్ రన్నవుతుంటే అటుచూశారు ఆడియన్సు.

''నా క్లబ్‌కీ, పేకాటకీ మాత్రం వుంచుకుని తక్కినదంతా నీ చేతులో పెడ్తా. ఈనాడు హోమియో వైద్యం గూడా బాగానే రాలుస్తున్నది. బాధారహిత వైద్యం, మూల్యం తక్కువ రోగులకి. చూస్తున్నావుగా'' అని లేచాడు ఉన్మాదిలాగా''.

''మీద చేయవేయకండి సాబ్. నా మానాన నన్ను జీవించనీయండి. పెళ్లి పేరెత్తకుండా మీద బడేవాడు ధూర్తుడు. అంటే రోగ్. దక్షిణ నాయకుడంటే గౌరవంగా వుంటుంది. కంట్రోల్ చేసుకోండి. కోయిల కూకూ కూసినట్లూ చిలకల అరుపులు వినబడుతున్నాయి మీకు. పంచబాణుడు, అయిదమ్ములు లాగినది రాడేమో. అది మోహమే. కట్టలు తెంచుకుని మిమ్మల్ని ముంచాలని

చూస్తున్నదేమో. శివునిలాగా కాముని భస్మం చేయాలి'' అన్నది లేవకుండానే కుర్చీల్లో బిగిసి కూచున్నది.

'' ఇలా పేలటానికన్నా రావచ్చునే. వినటానికి సొంపుగా వున్నాయి మాటలు. రావటం మానేశావేం. యేం? నేను చూడరా తగనా? అంద విహీనుడినా? మీద చేయివేయ తగనా'' అని వున్మాదం తగ్గినట్లు వెనక్కిపోయి సోఫాలో కూలబడి కాళ్లాడిస్తూ నవ్వుతున్నాడు. విద్యుద్దీపల వెలుగులో గాలిపంకా గాలి సరఫరా చేస్తుంటే కదిలే అలకలకతో మరింత కళ్లజబ్బు తెచ్చి పెట్టాడు సుశీకి. మెరిసేదే బంగారమనుకున్నది.

''మేము తగాదా పడ్డాము. శృతి మించి మా అమ్మ ఒట్టేసింది'' నే స్థిరపరచిన సంబంధం తిరస్కరించావు గనక నీ పెళ్లి విషయంలో నేనింక తలదూర్చను. యెవత్తెను తెచ్చుకున్నా నా యింటికి రావటానికి అవకాశం వుండదు'' అన్నది. నేను మా అమ్మకి ఫార్మాలిటీస్ చెల్లిస్తానంతే. ఆమె వస్తే స్టేషన్నించే వెనక్కి టికెట్ కొని పంపేస్తా. మా నాన్న సరేరాడు. అహితాగ్ని. నీ యింటికెవరూ రారు. నీ యింటికి నువు రాణివి. విదిన్ ది ఫోర్‌వాల్స్ అధికారమంతా నీదే. నేను చేయి జాపాలేగాని అంది. ఒళ్లో వాలే టీనేజర్లున్నారు. మునెమ్మ మిడ్ వైఫ్ నాలుగిళ్ల అవతల యింట్లో వున్నాది. గవర్నమెంట్ జాబ్ ఆమెది. స్వంత యిల్లు.

''రాత్రికి ఫోన్ చేసినా వస్తాను సాబ్'' అంటుంది.

''అక్కర్లేదు. ఫోనెత్తను'' అన్నా. నీకు స్పెషల్ విలువయిస్తూ చులకనైనానా? తప్పించుకోలేవు సుశీ'' అన్నాడు కీచకుని స్టైల్లో.

విజయ గొంతు వినిపిస్తే వింటూ చూడటం మానేశారు ఆడియన్సు'' అది మేల్ హిస్టీరియా అని గ్రహించలేక పోయింది నా కజిన్. అనుభవశాలీ గాదు. చెవులు నమ్మమన్నా మాటలు నమ్మింది. ఇంద్రియాలకు వశమైతే అంతా తారుమారౌతుంది. సరిగ్గా అలాగే జరిగింది. ఆల్ దట్ గ్లిట్టర్స్ యీజ్ నాట్ గోల్డ్ అని ఋజువైంది గురూ. అసలు రంగు, వెలిసిన బట్టలాగా నిషాదింపేసింది.

ట్రు కలర్స్ కనిపించసాగాయి. వెలిసిన బట్ట మీద వానిటీ, ఆరోగెన్స్ కనిపించాయి సుశీకి. చినుగులు వెంగలితనాన్ని వెల్లడించాయి'' అంటున్నది విజయ.

ఒక శ్రోత లేచి ''వెంగలి అంటే కరెక్ట్ అర్థం తెలియదు విజయా! తేలిక పదం వుందా?'' అన్నాడు. ఆడియన్సు గది నిండారని గమనించింది విజయ.

''వెకిలి అనటానికి గ్రాంధికం వాడితే గౌరవంగా వెంగలి అవుతుంది. తెలిసిందా?'' అన్నది.

''పోనీ అలాటి నిక్‌నేమ్ యెందుకు పెడతారు?'' మరొక శ్రోత అడిగింది సుజన్నీ.

''సభ్యత పాటించక, సిగ్గూ లజ్జా లేకుండా నోటికి స్వేచ్ఛ యిచ్చినా, అశ్లీ పదాలు, పచ్చి శృంగారం దొర్లించినా అలాగే పేరుబడతారు. బూతులు వినటంలో వున్న వుత్సుకత, మంచి సంభాషణ చేయటానికుండదు. సంస్కారం తక్కువ అని''

''అలా తేల్చుకున్నదా హీరోయిన్?''

''మరే''

''యెందుకని వదిలేయదూ. సంస్కృతి వున్నవాడినే'' అంటున్నాడో శ్రోత, వినాయక్ పాండే.

''నో.నో. మై ఫ్రెండ్స్‌ట చాలామంది అంతేనని పరిశీలన వల్ల తెలుసుకుని, టాలరెన్సు లాభిస్తుందనుకున్నదేమో''.

'' ఒకటి రెండు వుదాహరణ లివ్వగలరా విజయా?'' అనడిగింది విదియా విక్టర్''.

'' ఇబ్బందే లేదు ఫ్రెండ్స్! తాను మహాసుందరుడనని తనది గొప్ప కల్చరనీ, స్త్రీలు మోహపడి కలలు గంటారనీ అనుకోటం వానిటీ. ఒక్కొక్కసారి ఆవానిటీ మితిమీరుతుంది. తన హోమియో వైద్యం బాగా పేరూ డబ్బూ తేవటానికదే కారణమనుకుంటాడా రోమియో హోమియో. చింతామణి అనే డ్రామాలో

బిల్వమంగళుడనే స్కాలర్, బ్లైండ్‌లవ్‌కి గుర్తై చింతామణి అనే వెలయాలు నాట్యగత్తెకి వశవౌతాడు. పెద్ద గాలీ వానా వచ్చింది. ''చింతామణి భయపడుతుంది. పడగ్గదిలో ఒంటరిగా వుండలేదు. నేను వెళ్లి తోడుండాలి ధైర్యం చెప్పాలి'' అనుకుని వెళ్తాడు. సరీగ్గా అదే మనస్తత్వమా అన్నట్లు జరిగింది నెగెటివ్ హీరోకి. హర్ట్ అయినా, నెత్తి అడిచినా, సిగ్గులేని నవ్వు నవ్వుతూ యింటికొచ్చి సుశీతో అభినయంతో సహా చెప్పాడు.

''అయ్యో! సుశీ! నేనొచ్చినట్టు కలగంటూ కలవరిస్తూ వుంటుందని నిద్రవేళా క్వార్టర్సుకి వెళ్తే, అయ్యో, సుశీ! బెడ్ రూమ్ మూసి వున్నది. బయట ఒక నర్స్ కాపలా. అదీ వార్డ్‌బోయ్‌తో రమిస్తూ నన్ను చూసి వచ్చి దూరానికి తీసికెళ్లి నవ్వుతూ రహస్యంగా, చేయి అడ్డం బెట్టుకుని అన్నది. ''సాబ్! యూటూ ఆర్ లూర్డ్ బై మై మేడమ్ డాక్టర్. అలా నమ్మేయరాదు. హర్ట్ అవుతారు సాబ్. అప్పుడే యిద్దరు వ్యాపారులు నా మేడమ్ వేసిన ముగ్గులో నడిచారు. నేను నిందలేయటం లేదు. కీహోల్లోనించి చూస్తారా పోనీ సాబ్. మీరు ఇన్నొసెంట్. ఇలాటి వారి నెరగరేమో'' అంటూ స్వతంత్రంగా చేయి పట్టుకు లాక్కెళ్లింది. తానే నన్ను వంచి నా కన్ను కీహోల్ వద్ద వుండేట్టు చేసింది. హారిబుల్ సుశీ! అది చూసే ధడుసుకుంటే, పక్కనున్నా నర్స్ నన్ను మోచేత్తో పొడుస్తూ కన్నుగీటుతో నీలి లైట్లో నిలబడి, ''రహస్య ద్వారంగుండా పంపేదా సాబ్. నైట్ డ్రెస్ రెడీ'' అన్నది కదిలిపోతూ. వదిలించుకుని, గుండాగిపోకుండా చేయిపెట్టుకుని, కార్లో దూరి చక్రం బట్టి, చెమటలతో చొక్కా బనియన్ తడవగా చక్రం బట్టిన చేతులు చెమట వల్ల జారుతాయేమోనని వెరుస్తూ, దేనికీ డాష్ కొట్టకుండా యింటికొచ్చిపడ్డా. దాని లవ్వరు బోయ్ స్కాచ్ విస్కీ సేవించాడేమో. లేచి గలాభా చేయలేదు. ఇంటి కొచ్చి వాటేసుకుందామంటే బండ నిద్రా నువ్వూనూ. మేలుకునుండలేవూ?'' అన్నాడు. ఫిల్మ్ రన్నవుతుంటే శ్రోతలు వుత్సుకతతో అటు చూశారు అది దృశ్యకావ్యంలాగా వున్నది. ''మేలుకుని వుంటే మోడె... కాల్‌గళ్‌నా'' అంటిరే అన్నాది సుశీ.

''సుశీ! యెక్కడున్నావూ? కిచెన్‌లోనేనా యేమిటి కాపరం? సరదాలూ, సరసాలూ లేవా?'' అంటూ వచ్చాడు హోమియోపతి స్పెషలిస్టు. ''యేదో సరసానికంటే సీరియస్‌గా తీసుకోవాలా ఇహిహీ''

'స్నేహితులూ, అనుయాయులూ, తైనాతీలు వున్నారు గదండీ. మిమ్మల్ని అంటిపెట్టుకు తిరుగుతూ రంజింపచూస్తూ వుంటారు. పానకంలో పుడకలాగా నేను మిమ్మల్ని ఇరిటేట్ చేయాలా అనుకుని కిచెన్‌లో పనిపూర్తి చేస్తూ చూస్తున్నా'' అన్నది సుశీ.

''మాటలంటించవద్దని చెప్పానా. డేల్ కార్నేజ్ పుస్తకం కొనిచ్చానే. దెప్పొద్దు అని చెప్తుందా బుక్''.

''పోనీ చెప్పండి యేమిటి నాతో పని?'' అనడిగింది.

''నా ఫ్రెండ్ దేశికన్ తన భార్యని నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ చేశాడు. నాకు బాగా తెలిసిన మంచి డాక్టరమ్మని అర్జంటుగా పంపమ్మన్నాడు. సిజేరియన్ ఆపరేషన్ అవసరమైతే ముందే జాగ్రత్త పడాలన్నాడు.

''నార్మల్ డెలివరీయే అవుతుందేమో. యెందుకంత అట్టహాసం, హడావుడీ?'' పెద్ద పూరీలు మెషీన్ సాయంతో చేసి వేయించి విడివిడిగా ప్లేట్లలో పెడుతున్నది.

''చత్వారం యేర్పడే వయసు భార్యకి. కననూ అని శరిస్తే, దేశికన్నే, బతిమాలి బామాలి, కాళ్లా గడ్డాలూ పట్టుకుని, ''కడుపున పుట్టిన బిడ్డని పెంచుకుందాం డియర్! శిశు విహార్నించెందుకూ? కడుపు పండిందిగా డియర్! ఎడా ప్టేషన్ అనేది కష్టాలతో కూడిన పని డబ్బూ వదుల్తుంది'' అని సమాధానపరిచి, యెబార్షన్ చేయించు కోకుండా భార్యనంటి పెట్టుకునే వున్నాడట. చెప్పొచ్చిందడిగారు. సరేనని ఒప్పుకుని సాయపడదామని వెళ్తే, కిటికీ తీసివుంది గదా అని కిటికీలోంచి చూశా యేం చేస్తూ వుంటుందో డాక్టరమ్మ అని. వరండాలో యెవరూ లేరు. అయ్యో, సుశీ! పెట్టీకోట్ ధరించి, మోడరన్

క్లీనర్‌తో, సీలింగు గోడలూ క్లీన్ చేస్తున్నది. నవ్వుకుంటూ వెళ్లి బెల్ నొక్కితే, మెషీన్ ఆఫ్ చేసి వచ్చి తలుపుతీసి తీయగా నవ్వింది'' అలా కుషన్ కుర్చీలో కూచోండి సాబ్! డ్రెస చేసుకొస్తానని బెడ్‌రూమ్‌లో దూరి కాలితో తలుపు తన్ని మూసింది. గడియ పెట్టుకోదా? యెదరుగా నిలబడితే వచ్చిన పనిచెప్పా ''ఫోన్ చేశారే'' అని నవ్వింది తీయగా. తెల్లని నైలాన్ చీరపమిటలోనించి బ్లౌజ్‌కి పెట్టిన సేఫ్టీ పిన్నులు కనిపించాయి. అలా చూస్తుంటే నవ్వి ''ప్రెస్ బటన్స్ వూడిపోయాయి'' అని నవ్వింది. ఆలస్యం చేయకుండా షెడ్‌లోంచి కారు తెచ్చి చక్రం ముందు కూచుని మెయిడ్‌నీ, వాచ్‌మన్నీ కేకేసి వీధి తలుపూ వేసుకోమని షెడ్ తాళం వేయమనీ చెప్పింది. ఫ్రంట్ సీట్లో తన పక్కన కూచోమని కారు డోర్ నెట్టింది.

తీరా వెళ్తే, '' ఇంకా టైమున్నది మీల్సు రెడీ'' అన్నాడు దేశికన్. మరో గదిలో అంతా సిద్ధంగా వున్నది. సర్వ్ చేశాడు. కొత్తావకాయ ముక్క యెర్రగా రక్తం రంగులో వున్నది, వూటతో సహా పైకెత్తి ''యెంత బావుందో'' అని నోట్లో పెట్టేసుకున్నది. చప్పరించీ కొరికి తిని టెంక సాసర్లో వుంచింది. అంతకారం ముక్కయెలా తిన్నదో సుశీ! మంటబెట్టదూ?'' అని వెనక్కి తిరిగి లోవర్‌పార్ట్ చూపించాడు.

సుశీ పూరీలు భద్రం చేసి కూర్మా చేస్తున్నది. హీరో యిటు తిరిగి కంటిన్యూ చేశాడు. ''మోస్ట్ టాలెంటెడ్ లేడీ డాక్టరమ్మ. దేశికన్ వూహించినట్టే అయింది. డాక్టరమ్మ అలాగ్గా అనాయాసంగా ఆపరేషన్ జరిపింది. తల్లినీ బిడ్డనూ బతికించింది. ''అదృష్టం అమ్మా మగబిడ్డే'' అని చూపింది తల్లికి. నా కదంతా కృష్ణుడు గోవర్ధనగిరి యెత్తినట్టు, చిటికెన వేలితో యెత్తాడు. ఔనా సుశీ!'' అన్నాడు కదుల్తూ.

''ఔను. కరెక్ట్'' అన్నది సుశీ. కూర్మా తయారౌతున్నది.

సాయంకాలమైంది. పొద్దు వాటారుతున్నది. రాత్రికి సప్పర్ కానిచ్చి వెళ్లండి

అన్నాడు దేశికన్ ..... వస్తాయట. అదీ అయింది. నిద్ర వస్తున్నదన్నది. వేరే స్పేర్ రూమ్ చూపాడు దేశికన్. నేను బెడ్ మీద వాలాను. తొమ్మిది దాటింది.

"యెక్కడ పడుకుంటే యేమిటి" అని ఆవలిస్తూ వచ్చి నా బెడ్ మీద వాలింది. సుశీ! హయ్యో! నేను జెంటిల్‌మాన్ని గనక సరిపోయింది. లేకపోతే పెద్ద స్కాండల్ లేచేది సుశీ!" అని కదిలిపోతూ నవ్వుతున్నాడు హీరో.

వాకిట్లో కేక. పోయి తలుపు తీసి చూచాడు హీరో కుక్ నాయర్ మిరియం.

"నిన్న పెద్దమ్మ గారొచ్చారు సాబ్. హై బి.పీ. మొహం చేతులూ బాగా వుబ్బి యెర్రబడ్డాయి. మొహాన పులిపిరికాయలు లేచి దురదట. అమ్మగారికి అల్లోపతీ అలవాటు లేదు. హోమియో వైద్యంలోనే నమ్మకంట. అదే త్వరగా సత్ఫలితమిస్తుందట మేడమ్ నాకు డ్రైవింగ్ నేర్పించి లైసెన్సు తెప్పించారు. యల్ అనే యెర్రని అక్షరమున్న అట్ట కారు ముందు కట్టించారమ్మగారు. అవసరానికి హేండీగా వుంటానుట. కారూ తెచ్చా సాబ్. పోదాం రండి" అన్నాడు నవ్వుతూ.

"ఈ డాక్టరమ్మ మరీనూ. నన్ను వదిలేట్టు లేదు. మరో హోమియోపతిని పట్టుకోరాదూ. ఇదో మిష నన్ను పిలిపించటానికి. జెంటిల్‌మాన్ని గనక అపనిందలు రావటం లేదు. సుసీ. చూశావు. విన్నావు. పోతున్నా తలుపేసుకో. వాడెవరో ఆఫీసర్నని వేషం వేసి వస్తే "యింట్లో లేరని తలుపేసెయ్. బోగస్ సర్టిఫికేటూ బోగస్ వుద్యోగం వాడూ. లోపలకి రానిచ్చి కూచోమని బాతాఖానీ వేయకు. వాడొ పట్టాన వెళ్లడు. యేదో మిషపెట్టి రోజూ వస్తాడిహ. నువ్వు చాలా బాగా మాట్లాడుతావని చెప్పుకుంటున్నారు.

నువ్వు మా చిన్నమ్మ కూతురికి యిబ్బంది రోజులు, వెళ్లి నాల్రోజులుండి, యిబ్బంది తీరాకరా వంట చాలా బావుంటుందన్నది పిన్ని కామాక్షి.

అసలు, సుశీ! నిన్ను మా అమ్మ తీసికెళ్లటానికి వస్తానని ఫోన్ చెప్పింది. ఆమె మనుమడికి ప్రధానం జరిగి తాంబూలాలు పుచ్చేసుకోటం గూడా అయిపోయిందిట. లగ్గం వేళ్టికి నువ్వూ నీ పిల్లలు పెళ్లిపందిట్లో వుండాలిట.

పెళ్లి అంతా నీ చేతుల మీదుగా జరగాలిట.

పెళ్లి మిషపెట్టి యెక్కడెక్కడి బంధువులు వారం ముందే దిగడి, గడుస్తనంగా ''పెళ్లి పన్లు చేయటానికి వచ్చాం'' అని దొంగ నవ్వులు ఒలకపోశ బూరటట. యెంత పనీ. యేమీ పోకుండా చూసుకుంటూ వుండాలి వెయ్యికళ్లతో. అందుకనీ వచ్చి స్వయంగా నిన్ను తీసికెళ్లే అవకాశం కాస్తా మైనస్ అయిందిట. అందుకని మళ్లా ఫోన్ చేసింది మా అమ్మ. నన్ను తెచ్చి దింపి పొమ్మంది. సరదాగా వుంటుందిట నీకూ నీ పిల్లలకూ'' అంటున్నాడు. కదులుతున్నాడు. చేతులూ, కళ్లు తిప్పుతున్నాడు. నవ్వుతున్నాడు.

''కలుపుగోలుతనం చూపుతూ, పూసుకు తిరుగుతూ నలుగురిలో మెలగటం వస్తుంది నీకూ నీ పిల్లలకూ. పొరుగింటి పొయిరాళ్లల్లే వుంటే బాగుంటుందా? అది కల్చర్‌గాదు'' అని షరా మామూలే అన్నట్టు చెప్తున్నాడు. అదే తాజా కలం.

నయవంచన తెలిసిపోయింది సుశీకి. ఇపుడు ప్రపంచం తీరు తెలియని ముగ్ధ గాదు మొహానికి, కళ్లకూ చెవులకూ వశంగావటానికి. తోక మీద నిలబడి పడగ ఆడిస్తూ పడగతో అదను చూసి బాదటానికి సిద్ధంగా వున్నా యెర్రని ద్విజిహ్వ లాగా కనిపించాడా హోమియో వైద్యుడానాడు. మంచి అవకాశం జారవిడుచుకోరాదనుకున్నది సుశీ.

''మీ తల్లిగారేదో ఒట్టు పెట్టుకున్నారు. ఆమె పెట్టిన ఆజ్ఞాయేమ్మైంది. గాలిలో కలిసిందా. ముస్లిమ్ లీగ్‌అనే మంత్రం యెటో పారిపోయి దోపిడీ మొదలైతే యేమైందో తెలుసుగా ద్విజిహ్వాగారూ ఈ మాట మీ చేతిలోని తాడు ఆశపాశం కాదు నా మెడకు చుట్టటానికి పచ్చని నైలాన్ తాడు. తేలిగ్గా వూపిరి తీసేస్తుందది. మీరెలా వెంటబెట్టుకెళ్తారు. కూడానే రానీయలేదే? యేబ్రాసిలాగా వుంటే చూసి ''దీన్నా తెచ్చుకున్నావూ? యేం చూసీ'' అని చూచిన వారు నవ్వితే నేనేడుస్తూ యెంతసహ్యంగా వున్నానో, డబ్బూ లేదు అనుకుంటూట చెప్పారుగా. తాను దిగడినప్పుడే నా పిల్లలు తాకుతారని దూరదూరంగా జరిగి, ''తాకరాదు''

అన్నారు మీ అమ్మ. వేదాలనూ మన్నించని నన్ను, శాస్త్రాన్ని ధిక్కరించిన నన్ను సంఘ కట్టుబాట్లు పాటించని, అందరికీ అప్రతిష్ఠ, తలవంపులూ తెచ్చినదాన్ని యెన్ని గుండెలతో వెంటబెట్టుకెళ్తారు'' అన్నది. మా అమ్మ పగలలా మడిగానే వుంటుంది అందుకని తాకద్దు అన్నది.

''దెప్పుద్దనే మళ్లా చెప్తున్నా. పెళ్లి కొచ్చిన పెద్దలంతా దుయ్యబట్టేప్పటికి మా అమ్మకి సిగ్గేసి తలవంచుకుని ముసుగు కిందికి లాక్కుని, తడికళ్లు కనపడనీయక తప్త హృదయంతో క్షమ నేర్చింది. ''నేను మీ అందరికీ వెరవద్దా? నేనే వెళ్లి మనమలను మనమరాళ్లనూ కోడల్నీ వెంటబెట్టుకొస్తా'' అన్నది. ''నేను మీ అందరికీ వెరవద్ద? నేనే వెళ్లి మనుమలను మనమరాళ్నూ కోడల్నీ వెంటబెట్టుకొస్తా'' అన్నది అందరెదుటా. అన్నం తినటం లేదూ చెప్పింది చేయాలి'' అన్నాడు వైద్యుడు. ఒకరోజున గిరీశం బుచ్చమ్మ చేయి తన చేతిలో వేయించుకుని ఆచార విరుద్ధమైన పని, తిరుగుబాటుతనం తల్లో కెక్కించినటు యీ హోమియో గూడా చేస్తే ఆ రోజున వాని మూతి కాలి విల్లు లాగా కనిపించింది సుశీకి. మనిషి హరిలాగా కనిపించాడు. నేడదే మూతి అవ్వమూతిలాగా కప్పనోరులాగా కనిపిస్తుంటే సుశీకి నవ్వు వచ్చింది. ''ఇవాళ నా కళ్లు చెవులూ సత్యం గుర్తించమంటున్నాడు ఆనాడు మోసగించాయి'' అనుకున్నది.

''మాటకి మాట తెగులూ నీటికి నాచు తెగులూ. అన్నంగాదూ తినేది?'' యింకేదో అంటున్నాడు నవ్వు మొహమే హోమియో వైద్యునిది.

''అన్నమే తింటున్నా. హోమియో వైద్యులు వెల్లుల్లి నీరుల్లీ, యింగువా, కాఫీ వంటివి వాడరాదని డయట్ చెప్తారు. మనింట్లో అవిలేవు. ఎడ్డిక్ట్‌కి అదో రకమైన డయట్ అబ్జర్వ్ చేయమని ప్రిస్క్రైబ్ చేస్తారు. మీరు గడ్డి తినమనీ నా రోగానికదే డయట్ అనీ ప్రిస్క్రైబ్ చేస్తున్నారు'' అని నవ్వాలని ప్రయత్నించింది సుశీ.

పాలిటీషియన్‌లాగా, చెవిటివానిలాగా, అర్థంగానట్టు అదేదో భాషలో చెప్తుంటే చెవులప్పగించినట్టు చూసి, ''నేనన్నీ అరేంజ్ చేసి మనుషుల్ని పెట్టా. నాకు విదేశాలలో కాన్ఫరెన్సులున్నాయి. ఎయిర్ ట్రావెల్ ఖర్చులు వారే పెట్టుకుంటారు. నేను వెళ్లాలి . వుంటే నేనే వెంటబెట్టకెళ్దును నిన్ను నీ పిల్లల్ని. శ్రోతలిటుతిరిగి విజయను చూస్తూ అడిగారు ఫిల్మ్ ఆడటం లేదు. గురువు ఆనంద గూడా చివరికేమైందో అన్నట్లు తెలుసుకుందామని అన్నారు'' చివరి కేమైందీ విజయా మనసు మార్చుకుని, వెంటబెట్టుకెళ్లి దింపి తన కాన్ఫరెన్సు కెళ్లాడా హీరో''.

''అంత ధైర్యమున్నా గొప్ప గురూ, తాను భోజనం కానిస్తుండగా అతిధి వస్తే వాడికీ భోజనంపెట్టించే వాడూ, లేదా, వీధిలో నిలబడిన డ్రైవరు చేతులో డబ్బులేక, నెలాఖరు మరి, యింటికి గానీ హోటల్‌కిగానీ వెళ్లలేదనుకుని, అన్నా వడ్డించిన భోజనం పళ్లెం తీసికెళ్లి డ్రైవరు కిచ్చి వచ్చే మనిషి, యెవరింటికైనా వండిపెట్టిరా అని పంపే వుదారుడు, నా ప్రైవెసీ నాకు విలువైనదని తెలుసుకోనివాడు, బలిలాగా తన కీర్తి ప్రతిష్ఠలుకే ప్రయారిటీ యిచ్చేవాడూ వెళ్లిపోయాడు. వచ్చే కొత్త మొహాల వెంట నా కజిన్ కుక్కలాగా వెళ్లటమే తరవాయి. దాని గొంతుకి పటకా, పటకాకి గొలుసూ యిచ్చే వెళ్లాడా వుదరుడు. ''విజయ ముక్కు పుటాలదిరి, పెదమలదిరి కళ్లెర్రబడ్డాయి.

గురువు ఆనంద సింపథిటిగ్గా అడిగారు. సంతానం కలిగిందే విజయా. బాధ్యతలు లేవనీ, కనీసం వారి శ్రేయస్సు కోసం నీ కజిన్ తనను తాను హర్ట్ చేసుకునే వ్రతం బట్టిందేమో. మొదట్లోనే బాలనాగమ్మతో పోల్చావు. బాలనాగమ్మ పన్నెండేళ్లు వ్రతంబట్టానన్నది ఆ జానపద గాధలో. నీవు వుద్రేకపడ్డావు విజయా.

''కలక్కపోయినా బాగుండేది గురూ. యెబార్షన్ పేరెత్తి స్పెషలిస్టుని తెస్తా''నని హీరో అంటే ''అది భ్రూణ హిత్యం అన్నదట ''ప్రిమిటివ్ థింకింగ్'' అన్నాడట ''పెద్ద చదువు చదివి పెద్ద జాబ్ చేస్తూ రెండు చేతులా సంపాదించుకుంటూ, రెండు చేతులా ఖర్చు చేసుకుంటావని నీ మీద ఇన్‌వెస్ట్

చేస్తూ అయ్యో! రాత! కామన్ వుమన్‌లాగా వరసగా పిల్లల్ని కన్నావే సుశీ! ఫూల్!'' అన్నాడట గురూ! కనటం వరకే సుశీ బాధ్యత. దాదిలాగా వుండిపోయింది. వాళ్ల మీద పెట్టుబడి తనది గనక యే విషయంలోనూ వేలుదూర్చద్దని కట్టడి చేశాడట. యెవరు యేమడిగినా లేదనగూడదట. ''మనింట్లో యిదుండాలే ...లో అది వుండాలే తీసుకొచ్చి యియ్యి'' అని వారెదటే అనేవాడట. ఆవకాయ అడిగితే యిస్తే ''గుండ యెక్కువ వేయండి'' అన్నదిట అడిగినామె''.

విమల్ రెడీమేడ్ గుడ్డల బిజినెస్ కొత్తగా పెట్టి రన్ చేస్తున్నాడు. ''గుండ అంటే యేమిటి మేడమ్! నేను వినలేదు'' అన్నాడు మాటమార్చాలనీ నవ్వించాలనీ.

''ఊరగాయల్లో వుండే పిండి, వూటతో కలిసి చాలా రుచిగా వుంటుంది. ఇన్‌గ్రెడియంట్సు ముద్దు అన్నమాట. వూరుబిండి అంటే వడియాలు పెట్టేందుకు సిద్ధం చేసిన రుబ్బిన పిండి. దానిలో బూడిద గుమ్మడి సన్నగా తరిగిన ముక్కలూ, పచ్చి మిరప వుప్పునూరిన పదార్థం, కావాలంటే అల్లం జీరా, కొతిమీర నూరి అదీ కలిపి అదీ ఆదరవుగా వడ్డిస్తారు. అప్పడాల పిండీ గట్టిగా కలిపి నూనె రాచి వుండలు చేసే అదీ సర్వ్ చేస్తారు. చాలా రుచి, విటమిన్లుంటాయి. అలా చేయించి కాల్చుకు తినటం సరదా హోమియోకి.

''అన్నీ ఏకీభవిస్తాం నీతో విజయా. కాని నువ్వు వివశవైనావు. తలపెట్టిన పనీ బార్బరస్ అనిపించలేదూ.

''నేను నా కజిన్ని చూడాలని వెళ్లాను గురూ. ఆఫ్టర్ ది స్టామ్ కమ్స్ ది కామ్ అన్నట్లున్నాది దాని మొహం మాటా పలుకూ లేదు. యేదైనా అఘాయిత్యం తలపెట్టిందేమోననిపించింది గురూ. చేతులు కాలాక ఆకులెందుకని, నేనే ఫినిష్ చేద్దామా క్లెప్టోమానియాని అని పరుగెత్తాను. మానియా యీజ్ లకీ యినఫ్ టు బి యె లైల్''.

''కాని విజయా! అదంతా అసాధ్యమని తట్టలేదూ పోనీ అంటే నీవు హత్యానేరంలో, దోషిగా, న్యాయస్థానంలో నిలబడవా న్యాయాధీశుని

యెదుట''.

''అసాధ్యమేమున్నది గురూ. మానియా లోపలికెళ్లకముందే బయట జరిగే చెకింగప్పుడే పని పూర్తి అయిపోతుంది. న్యాయస్థానంలో, న్యాయాధీశుని యెదుట నిలబడటం అవమానకరం కాదని నా అభిప్రాయం గురూ. లాస్ట్ జడ్జిమెంట్నాడు ప్రభువు యెదుట, నెగెటివ్ హీరో నిలబడడా. ప్రభువు గూడా మానియా అని వదిలేస్తాడా తెలుసుకోవాలి. ఆడియన్సంతా లేచి గుడ్బై చెప్పి, విజయను చూసి నవ్వి కంగ్రాట్స్ ఫర్ ది వినోదం అని చెప్పి వెళ్లిపోయారు.

గురువూ, విజయా మిగిలారు.

చల్లని చూపూ, దయ, క్షమ, ప్రేమ ఆ చల్లని చూపులో ప్రతిఫలించాయి.

''హీరో యేనాడూ తనను తాను అసంజసమనుకోనట్టే'' నేనూ నా ఆలోచనలను అసమంజసంగా భావించలేదు గురూ'' అన్నది విజయ.

శరత్కాలంలో పౌర్ణమి వెన్నెలలాగా నవ్వుతూ గురువు ఆనంద అన్నారు. 'సమంజసమే కావచ్చు. అది న్యాయమే కావచ్చు విజయా! కాని న్యాయం వేరు ధర్మం వేరు. ధర్మజుని ధర్మరాజు అన్నారు గానీ న్యాయరాజు అనలేదే. తరచి చూస్తే నీ కజిన్ది తపస్సే. సత్త్వగుణం సాధన చేసిన మోడరన్ తపస్సు. కోరికలేని, ఫలితాన్ని ఆశించని, కేవలం సంతు శ్రేయస్సు కోసమే తపశ్చర్య నడిపింది నీ కజిన్. శక్తిమేరకు ఆత్మగౌరవం కాపాడుకుంటూ వచ్చింది. క్రైసిస్ వస్తే దైవం తప్పక వచ్చి క్రైసిస్ తొలగిస్తాడని నమ్మి వుండచ్చు. యెందుకనంటే విజయా ఇద్దరూ యంక్వయరీ చేశారు.

'' ఇక్కడ యోగదృష్టి నేర్పబడును'' అనే స్కూలు నడుస్తూ వుండేదే. యేమైందీ? బల్లా లేదు?''

''మరో మహానగరానికి మారి వుండాలి మేడమ్. మీరు యిటుగా వచ్చి చాలా రోజులై వుండాలి. టెలిఫోన్ డైరెక్టరీ కొని తాపీగా వెతికితే వారి పతా నంబరూ స్టాక్సు ఫాక్సు నంబరూ కనబడచ్చు''

చారుమతీ విజయలా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. జవాబిచ్చినాయనకు థాంక్స్ చెప్పారు.

''విజ్జీ డైమండ్ యియర్ రింగ్స్ చూడాలని గదూ బయలుదేరదీశావు. ఇన్విటేషన్ గూడా చూపావే. ఆరైంది పోదాం రా. అదుగో టాక్సీ'' అని చారుమతి చేయి వూపుతూ టాక్సీ ఆపించింది. అందులో దూరి అడ్రస్ చెప్పారు. కారు బయలుదేరింది.

నారీమణికి చీరలిచ్చినదీ విన్నది నీ కజిన్. నీరజాక్షికై నీరధి దాటినదీ విని వున్నది నీ కజిన్'' అన్నాడు శాంతంగా.

విజయ నోరు విప్పి యేదో అనబోయి అలాగే వుండి, గురువును కన్నార్పకుండా చూసింది.

''గురూ! యోగదృష్టి, యింద్రజాలం, కంప్యూటర్, ఇంటర్‌నెట్, వీడియో ఫిల్మ్ తీయగలగటం కన్న మరో గొప్పదున్నదని తెలియజెప్పారు నాకు. అది నేర్వాలి నేను. నమస్తే గురూ!'' అని లేచి నిలబడి తలవంచి దణ్ణం పెట్టింది విజయ.

ఆనాడు విజయ మళ్లా తన ఫ్రెండ్ చారుమతిని నగల షాపు చూడాలి సాయం రమ్మని బయలుదేరదీసింది. రవ్వలనగల ప్రదర్శన జరుగుతున్నదిట. కొత్త డిజైన్లు ఇయర్ రింగ్స్ వచ్చాయిట. వస్తానన్న టాక్సీ రాలేదు. ఆటోలోనే బయలుదేరారు అయిదు గంటలకి.

''యోగదృష్టి నేర్పబడును అనే బల్లకంటబడలేదు.

'' ఆపు '' అన్నది విజయ.

ఆటో ఆగింది. ఇద్దరూ దిగారు. ఒప్పుకున్న బాడుగ చెల్లించేసింది విజయ.

''మేము యిక్కడొకరిని చూసి వెళ్లాలి. నీవు వెళ్లచ్చు అన్నది. ఆటో వెళ్లిపోయింది.

కథా నిలయం
5257
శ్రీకాకుళం